ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

గురువారం 11 డిసెంబరు 2025 | 7

అన్నవరం దేవస్థానం ఈవోగా త్రినాథరావు బాధ్యతల స్వీకరణ 9

అంతర కళాశాలల ఫుట్‌బాల్ విజేతగా కాకినాడ ఐడియల్ 8

‘టెట్’కు తొలిరోజు 334మంది అభ్యర్థుల హాజరు



కాకినాడ అచ్యుతాపురం రైల్వే గేటువద్ద ఉన్న కేంద్రంలో పరీక్ష రాసేందుకు క్యూలో వెళ్తున్న అభ్యర్థులు

» 31మంది గైర్హాజరు: డీఈవో

కాకినాడ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు జిల్లాలో మూడు సెంటర్లలో బుధవారం టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)- 2025 జరగ్గా 334మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఆన్‌లైన్‌లో జరిగే టెట్ పరీక్షకోసం 365మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 334మంది పరీక్షకు హాజరవ్వగా 31మంది గైర్హాజరయ్యారని ఆయన చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మరో 9రోజులపాటు పరీక్ష జరగనుందన్నారు.

క్రీడా సంబరం

» జేఎన్టీయూకేలో సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలు ప్రారంభం

» కాకినాడ జిల్లాలో మూడు చోట్ల టోర్నమెంట్ నిర్వహణ

» మొదటి రోజు 40 మ్యాచ్‌లు 9




కొత్త ఐడియా

» కొబ్బరికాయలను డొల్ల చేస్తున్న ఉడతలు

» పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానంలో చెట్లకు స్టీలు తొడుగులు ఏర్పాటు

» ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న శాస్త్రవేత్తలు 8



2 జిల్లాలకు 100 బస్‌లు

ఈ-బస్‌లు.. వస్తున్నాయ్!

కొత్తగా ప్రగతి రథచక్రాలు

వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 150 భారీ ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. తొలివిడత కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 100 బస్సులను కొనుగోలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి కొన్ని నెలల కిందట రాజమహేంద్రవరం వచ్చినప్పుడు అధికారులతో ఈ విషయంపై చర్చ జరగ్గా ఉమ్మడి జిల్లాకు తొలి విడత కింద 150 బస్సులు అవసరమని వివరించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాలకు ఈవీ బస్సులను కేటాయించాల్సి ఉన్న నేపథ్యంలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు వంద బస్సులను మాత్రమే కేటాయించారు. ఒక్కో బస్సులో 40 వరకు సీట్లుండే ఈవీ బస్సుల్లో అన్ని ఆధునిక సౌకర్యాలు ఉంటాయని అధికారులు వివరించారు. ఒక్కో బస్సు ధర రూ.1.50 కోట్లు.. 100 బస్సులకు రూ.150 కోట్లు అవుతుంది.

» ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి ఎలక్ట్రికల్ బస్సులు

» కాకినాడ, ‘తూర్పు’నకు 100 కేటాయింపు

» ‘కోనసీమ’కు మలి విడత

» ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం

» ఒక్కో బస్సు ఖరీదు రూ.1.5 కోట్లు

» రూ.150 కోట్లతో కొనుగోలు

» ఆరు నెలల్లో రోడ్డెక్కనున్న బస్సులు

» ఉమ్మడి జిల్లాలో 20 ఛార్జింగ్ స్టేషన్లు

» భారీగా ఖర్చు తగ్గుతుందని అంచనా

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో త్వరలో ఆర్టీసీ ఈవీ బస్సులు రోడ్డెక్కనున్నాయి. మరో ఆరు నెలల్లో ప్రయాణికులకు అందుబాటులోకి రాబోతున్నాయి. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 50 చొప్పున ప్రభుత్వం ఈవీ బస్సు లను కేటాయిస్తోంది.కోనసీమ జిల్లాకు ఈ దఫా వాయిదా వేసి మలివిడతలో కేటాయించనున్నారు. ఒక్కో బస్సు రూ.1.50 కోట్ల చొప్పున 100 బస్సులకు ప్రభుత్వం రూ.150 కోట్లు వెచ్చించబోతోంది.బస్సుల రాకతో ఖర్చుల భారం తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు.

ఒక్కో బస్సులో 40 సీట్లు

గత వైసీపీ సర్కారు ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేసింది. కొత్త బస్సుల కొనుగోలు, అదనపు రూట్లను అటకెక్కించేసింది. ఇప్పుడు ప్రభుత్వం ఆర్టీసీకి అన్ని విధాలా సహకారం అందిస్తుండడంతో ప్రయాణికులను దగ్గరయ్యేందుకు ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేస్తోంది.అందులో భాగంగా కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 50 బస్సులు కేటాయిస్తూ ఆదేశాలిచ్చింది.ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందింది.ఈవీ బస్సులకు రూట్లను ఎంపిక చేయాలని ఆదేశించడంతో తాజాగా అధికారులు పూర్తిచేశారు. ఒక్కో బస్‌లో 40 సీట్లు ఉంటాయి.

20 ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు

100 ఎలక్ట్రికల్ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్లకు భారీగా ఖర్చవుతుందని భావిస్తున్నారు. హైస్పీడ్‌తో కూడిన ఛార్జింగ్ కేంద్రాలను 20 వరకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, తునిలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.బ్యాటరీ బైక్‌కు కనీసం 6 గంటల వరకు ఛార్జింగ్ చేస్తేనే గానీ బ్యాటరీ ఫుల్ కాదు. కానీ రాబోయే ఎలక్ట్రికల్ బస్సులకు 2 గంటలు ఛార్జింగ్ చేస్తే బ్యాటరీ ఫుల్ కానున్నాయి. కొత్త ఎలక్ట్రికల్ బస్సులు భారీ బ్యాటరీ సామర్థ్యంతో తయారవుతాయి. రోజులో ఒకసారి ఛార్జింగ్ చేస్తే సరిపోవచ్చని అధి కారులు చెబుతున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎలక్ట్రిక్‌తో లాభాల పంటే..

ఇప్పుడు ఎక్కడ చూసినా ఎలక్ట్రికల్ వాహనాలపైనే మొగ్గుచూపుతున్నారు. ఆర్టీసీ సైతం ఈవీ బాట పట్టింది. వచ్చే ఏడాది జూన్ నాటికి ఎలక్ట్రికల్ బస్సులను భారీగా రోడ్లపైకి దించబోతోంది. ఇప్పటికే డీజిల్ ధరలు పెరగడంతో నానాటికీ నిర్వహణ వ్యయం తడిసి మోపెడవుతోంది. దీంతో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఆర్టీసీ చవిచూస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికుల సర్వీసుల్లోను కొత్త పద్ధతులు అనుసరించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఖర్చులు నియంత్రించుకోవాల్సిన అవసరత ఏర్పడింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కొత్త బస్సుల కొనుగోలు, రద్దీ రూట్లలో సర్వీసుల పెంపు వరకు అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది.అందులో భాగంగా ఇకపై ఈవీ బస్సులను భారీగా కొనుగోలు చేసి అందిస్తోంది.

రూట్‌లు ఇలా

వంద ఈవీ బస్సుల్లో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల నుంచి విశాఖ, విజయవాడ రూట్‌లో 46 బస్సులు నడపనున్నారు.కాకినాడ- అమలాపురం, రాజమహేంద్రవరం-అమలాపురం రూట్‌లో 12, కాకినాడ- రాజమహేంద్రవరం నగరాల మధ్య రోజుకు 14 రెండు జిల్లాల ఈవీ బస్సులు తిప్పాలని నిర్ణయించారు.కాకినాడ జిల్లాకు కేటాయించిన 50 ఎలక్ట్రికల్ బస్సుల్లో కాకినాడ-విశాఖపట్నం 30, కాకినాడ -రాజమహేంద్రవరం 7, కాకినాడ- అమలాపురం 6, కాకినాడ- నర్సీపట్నం 4, కాకినాడ-తుని 3 చొప్పున ఖరారు చేశారు. తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించిన 50 బస్సుల్లో రాజమహేంద్రవరం- విజయవాడ 16, రాజమహేంద్రవరం- కాకినాడ 12, రాజమహేంద్రవరం-అమలాపురం 12, రాజ మహేంద్రవరం-తుని 10 బస్సులను తిప్పేలా ప్రణాళిక ఖరారు చేశారు.ఈవీ బస్సుల్లో టికెట్ ధరలు బాగా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం.. పటిష్టంగా అమలు చేయాలి

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, పోలీసు, స్త్రీశిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, జిల్లాస్థాయి పీసీ అండ్ పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో ఉన్న 159 స్కానింగ్ కేంద్రాల్లో 280 ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. 48 స్కానింగ్ సెంటర్‌లో డెకాయిట్ ఆపరేషన్లు నిర్వహించామన్నారు. జిల్లాలోఉన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, సచివాలయం, ప్రైవేటు స్కాన్‌సెంటరు, ప్రైవేటు ఆస్పత్రిల్లో ఈ చట్టం టోల్‌ఫ్రీ నెంబరు, వాట్సాప్ మొబైల్ నెంబర్లతో స్టిక్కర్లను స్కానింగ్ సెంటర్‌లో, రిసెప్షన్‌లో, వెయింటింగ్ హాలులో ప్రదర్శించాలన్నారు. అల్ట్రా సౌండ్ వైద్యపరీక్ష లు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరమని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నాలుగు నూతనంగా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేశామన్నారు. జిల్లాలో చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాల సమాచారం, అర్హత లేని వైద్యులు వివరాలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబరు 18004 253365, వాట్సాప్ నెంబరు 94941 13365 నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో డీఎం అండ్‌హెచ్‌వో నరసింహ నాయక్, ఎస్‌బీ డీఎస్‌పీ సత్యనారాయణ, డీసీహెచ్‌ఎస్ మహేశ్వరరావు, డాక్టర్ మెహర్ కుమార్, డాక్టరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

» జేసీ అపూర్వ భరత్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నూరుశాతం పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం ఆయన రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులతో ఖరీఫ్ ధాన్యం సేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 1.64లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలన్నారు. రైస్‌మిల్లులవద్ద రద్దీ లేకుండా ట్రక్కులను ఎప్పటికప్పుడు ఖాళీ చేయించాలన్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌కుమార్, పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజర్ దేవులనాయక్, డీఎస్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి నుంచి అన్నవరం వరకు నిర్మించిన జాతీయ రహదారి భూసేకరణ పురోగతి, కాకినాడ సెజ్ భూములు రైతులు పేరున బదిలీ చేసే ప్రక్రియపై రెవెన్యూ, కేఎస్ఈజెడ్, ఎన్‌హెచ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ పోర్టును జాతీయ రహదారులకు అనుసంధానం చేసే ప్రక్రియలో భాగంగా వాకలపూడి నుంచి అన్నవరం వరకు నిర్మించిన జాతీయ రహదారికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. నిర్ణీత సమయంలోపు భూ సేకరణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జిల్లాలో యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఎస్ఈజెడ్ లిమిటెడ్ కింద కాకినాడ డివిజన్, పెద్దాపురం డివిజన్ పరిధిలో ప్రత్యామ్నాయ భూమి 259.040 ఎకరాలు, రైతులు వదిలేసిన భూమి 930.176 ఎకరాలు భూమిని 1545 మంది రైతులకు బదిలీ చేయాల్సి ఉందన్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ పత్రాలపై స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు రెవెన్యూ, కేఎస్ఈజెడ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సెజ్ భూములను రైతుల పేరున బదిలీ చేసే ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో వెంకట్రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, ఎస్ఈజెడ్ ఎస్డీసీ శ్రీధర్, కాకినాడ సెజ్ జీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈనెల 21న నిర్వహించే పల్స్ పోలియోపై సన్నద్ధం కావాలన్నారు. ఎప్పటికప్పుడు అన్ని యాప్‌లలో వివరాలు నమోదు చేయాలన్నారు. జిల్లాలో మాతృమరణాలు, శిశు మరణాలు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మాతృమరణాలు అరికట్టడంలో కమ్యూనిటీస్థాయి ఫెసిలిటీ లెవెల్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అవగాహన పెంచాలన్నారు. యూపీహెచ్‌సీ రామారావుపేట, ప్రతాప్‌నగర్, హెల్త్‌వెల్ సెంటర్ పెదబ్రహ్మదేవం1, 2, నేమాం, తుని ఏరియా ఆసుపత్రి చిన్నపిల్లల విభాగానికి జాతీయ ఆరోగ్య నాణ్యత ప్రమాణాల విభాగాలకు ఉత్తమ ప్రశంసాపత్రాలు కలెక్టర్ అందజేశారు. డీఎంహెచ్‌వో నరసింహనాయక్, డీసీహెచ్‌ఎస్ మహేశ్వరరావు, డీఎల్‌టీవో చలమయ్య, ఇమ్యూనేషన్ జిల్లా అధికారి సుబ్బరాజు పాల్గొన్నారు.

‘ఉమ్మడి తూర్పు’లో 13న జాతీయ లోక్ అదాలత్ 8



‘భూ’ బెంగ తీరేనా..

» జిల్లాలో భూముల రీసర్వే చిక్కుముళ్లు ఇకనైనా వీడేనా

» రీసర్వే పూర్తయిన భూములపై ఒక్క సమస్య కూడా ఉండొద్దన్న సీఎం

» 22ఏ భూములు, జాయింట్ ఎల్‌పీఎంలపైనా స్పష్టమైన ఆదేశాలు

» ప్రభుత్వం మారాక వైసీపీ సర్కారు అడ్డగోలు రీసర్వేపై 8,537 ఫిర్యాదులు

» గతేడాది జూన్ నుంచి నేటి వరకు గ్రీవెన్స్‌లోనూ 11,589 అర్జీలు

» కానీ వీటిలో అనేకం పరిష్కారంకాక నేటికీ బాధితుల నరకయాతన

గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన భూముల రీసర్వే సమస్యలు ఇప్పటికీ పరిష్కారంకాక ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రభుత్వం మారి ఏడాదిన్నర అవుతున్నా చాలావరకు అపరిష్కృతంగానే మిగిలాయి. అనేకమంది ప్రజలు తమ భూసమస్యలు పరిష్కరించాలంటూ అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో వీటికి చెక్ పెట్టాలని సీఎం చంద్రబాబు తాజాగా ఆదేశాలు జారీ చేయడంతో బాధితుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎన్నో ఏళ్ల నుంచీ పక్కా హద్దులు, రికార్డులతో కొనసాగుతోన్న భూములను జగనన్న శాశ్వత భూహక్కు రీసర్వే పేరుతో గత వైసీపీ సర్కారు వివాదాస్పదంగా మార్చేసింది. హడావుడి సర్వేతో అధికారులపై ఒత్తిడి తెచ్చి జిల్లాలో 20 మండలాల్లో 292 గ్రామాల్లో రీసర్వే చేయించారు. దీంతో అనేక వివాదాలు తలెత్తాయి. భూయజమానులు లేకుండానే ఇష్టానుసారంగా గ్రామాల్లో అధికారులు సర్వేలు చేయడంతో వేలాదిమంది భూముల విస్తీర్ణం తగ్గిపోయింది. పాస్‌బుక్‌ల్లో ఉన్న భూమికి బదులు విస్తీర్ణం తగ్గించేసి చూపించారు. భూహద్దులు మార్చేశారు. వేర్వేరు సర్వే నెంబర్లతో ఉన్న వ్యక్తుల భూములకు జాయింట్ ఎల్‌పీఎంలు కేటాయించి అస్తవ్యస్తం చేసేశారు. జిరాయితీ భూములను అడ్డగోలు రీసర్వేతో ఏకంగా చుక్కల భూములుగాను, 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చేశారు. ఇలా ఒకటికాదు రెండు కాదు వందలాది కొత్త వివాదాలను భూసర్వే పేరుతో అప్పటి ప్రభుత్వం సృష్టించింది. తీరా బాధితులు తమకు జరిగిన అన్యాయంపై అధికారుల వద్దకు వెళ్లినా కనీసం పట్టించుకోలేదు. ఎక్కడో దేశ విదేశాల్లో ఉంటున్న వారు సైతం రీసర్వే తీరుతో నష్టపోయారు. జిల్లా అంతటా రీసర్వే వేగంగా పూర్తిచేయాలనే ప్రభుత్వ ఒత్తిళ్లతో సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టలేదు. ప్రభుత్వం మారాక రీసర్వే ద్వారా తలెత్తిన భూమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామసభల ద్వారా ప్రభుత్వం వినతులు స్వీకరిస్తే ఏకంగా 11,059 మంది బాధితులు తమ భూసమస్యలు పరిష్కరించాలంటూ గ్రామసభల్లో ఫిర్యాదులు చేశారు. ఇందులో ఒక్క రీసర్వే పేరుతో తలెత్తిన భూవివాదాల అర్జీలే 8,537 ఉన్నాయి. అయితే ప్రభుత్వం మారి ఏడాదిన్నర అవుతున్నా వీటిలో అనేక సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. 22ఏ జాబితా నుంచి భూముల తొలగింపు, ఎల్‌పీఎంల సమస్య వరకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల వద్ద అధికారాలు ఉన్నా వారు ఈ సమస్యలపై పూర్తిగా దృష్టిసారించలేని పరిస్థితుల వల్ల ఇప్పటికీ వాటి చిక్కుముళ్లు వీడలేదు. ఫలితంగా బాధితులు ఇప్పటికీ ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌కు న్యాయం కోసం కాళ్లరిగిలా తిరుగుతున్నారు.

జేసీల నుంచి ఆర్డీవోలకు బదిలీ..

ప్రభుత్వం మారి ఇంతకాలం అయినా ఇంకా రీసర్వే సమస్యలు పరిష్కారం కాకపోవడంపై సీఎం చంద్రబాబు మంగళవారం రెవెన్యూ శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రీసర్వే చిక్కుముళ్లు తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ల వద్ద కీలక అధికారాలు ఉండడంతో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఇకపై భూవివాదాల పరిష్కార బాధ్యతలను కొన్నింటిని ఆర్డీవోలకు బదిలీ చేశారు. దీంతో జిల్లాలో పేరుకుపోయిన అనేక భూసమస్యలకు మోక్షం లభించనుంది. జాయింట్ ఎల్‌పీఎంల సమస్య పరిష్కరించి ఎవరి భూమి వారి పేరుపై ఉండేలా చూడాలని ఆదేశించారు. అలాగే నిషేధిత భూములు, చుక్కల భూములు, ఈనాం భూముల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రైతుల పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. అలాగే రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జేసీల పనితీరును గమనిస్తామని హెచ్చరించారు. దీంతో ఇకపై బాధితులకు న్యాయం జరుగుతుందనే భావన వ్యక్తమవుతోంది. ప్రధానంగా రీసర్వే తర్వాత 22ఏ జాబితాలో చేర్చిన భూములతో అనేకమంది యజమానులు నరకం చూస్తున్నారు. తమ భూములను విక్రయించుకోలేక నరకం చూస్తున్నారు. వాస్తవానికి ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌సెల్‌కు గతేడాది జూన్ నుంచి బుధవారం వరకు మొత్తం 11,589 ఫిర్యాదులు వచ్చాయి. ప్రధానంగా గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకు తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని 72 మంది అర్జీలొచ్చినా ఇంకా 41 అర్జీలు పరిష్కారమే కాలేదు. అలాగే భూయాజమాన్య హక్కు పత్రాలకోసం 2,249 మంది దరఖాస్తు చేసుకుని తిరుగుతున్నారు. రీసర్వే బాధితులు 953 మంది అర్జీలు పెట్టి తిరుగుతున్నారు. తమ భూమి కబ్జాకు గురైందని 518 మంది ఫిర్యాదుచేశారు. ఆర్డీవోలకు అధికారాలు కట్టబెట్టడంతో చిక్కుముళ్లు వీడే అవకాశం ఉంది.

కేంద్ర మంత్రితో కాకినాడ ఎంపీ భేటీ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ బుధవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మామిడి తాండ్రపై కేంద్రం ఇటీవల జీఎస్టీని భారీగా తగ్గించడంతో ఎంపీ మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మామి డి తాండ్ర పరిశ్రమ ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. రూ.400 కోట్లు టర్నోవర్ కలిగిన ఈ పరిశ్రమ ద్వారా 15 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. మామిడి తాండ్రపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

‘పాదగయ’ ఆదాయం రూ.24.73 లక్షలు

పిఠాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఉన్న ఉమా కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల లెక్కింపు బుధవారం జరిగింది. 68 రోజులకు ఆలయంలోని హుండీల ద్వారా రూ.23,32,155 రాగా, అన్నదానం హుండీ ద్వారా రూ.1,41,215 వెరసి రూ.24,73,370 ఆదాయం లభించినట్టు పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. హుండీల లెక్కింపులో బ్యాంకు, ఆలయ సిబ్బంది, భక్త బృందాల సభ్యులు పాల్గొనగా, జిల్లా దేవదాయశాఖాధికారి కనపర్తి నాగేశ్వరరావు, తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్ పర్యవేక్షించారు.

ఉడత ఊపులకు చింతకాయలు రాలుతాయా అని సాధారణంగా అందరూ అనుకుంటాం. అదేమో కానీ ఉడత కొరుకుడికి మాత్రం కొబ్బరికాయలు రాలిపోతున్నాయి. దీంతో కొబ్బరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఉడత చిన్నదే కానీ అదిచేసే నష్టం మాత్రం ఎక్కువగా ఉంటోందని



కొబ్బరి చెట్లకు అమర్చిన స్టీలు తొడుగులు

పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు గమనించారు. దీంతో ప్రయోగాత్మకంగా కొబ్బరిచెట్లకు స్టీలు తొడుగులు ఏర్పాటుచేసి ఉడతలు చెట్లు ఎక్కకుండా నివారిస్తున్నారు. దీంతో ఆశించిన ఫలితాలు కొంతమేర వస్తున్నాయని చెప్తున్నారు.



ఉడత కొట్టుడు!





- కొబ్బరికాయలను డొల్ల చేస్తున్న చిట్టి ప్రాణులు
- కన్నీరుమున్నీరవుతున్న రైతులు
- పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానంలో చెట్లకు స్టీలు తొడుగులు ఏర్పాటు
- ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న శాస్త్రవేత్తలు
- ఆశించిన స్థాయిలో ఫలితాలు

పెద్దాపురం-ఆంధ్రజ్యోతి

కొబ్బరి పేరు చెప్పగానే మనందరికీ గుర్తుకొచ్చేది కోనసీమ. కల్పవృక్షంలాంటి కొబ్బరిపంటపైనే ఆధారపడి అక్కడి రైతులు తమ జీవితాలను వెళ్లదీస్తుంటారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఎకరాల్లో కొబ్బరి సాగవుతుంటే అధిక భాగం కోనసీమలో విస్తరించి ఉంది. కోనసీమను కొబ్బరిసీమ అని కూడా పిలుస్తారు. ఇక్కడి కొబ్బరి రైతులకు ప్రస్తుతం ఉడతల రూపంలో కొత్త సమస్య వచ్చిపడింది. కోతులకంటే ఉడతలే కొబ్బరి తోటలను అధికంగా పాడుచేస్తున్నాయి. ఉడతలు గుంపులుగుంపులుగా వచ్చి ఇంకా ఎదగని లేత కాయలను పూర్తిగా నాశనం చేస్తున్నాయి. చూడ్డానికి చిన్నగా అమాయకంగా కనిపించే ఈ ప్రాణులు వందలాది ఎకరాల్లో కొబ్బరి తోటలను నాశనం చేస్తూ రైతులకు లక్షల్లో నష్టాన్ని మిగులుస్తున్నాయి.

కొబ్బరిని సాధారణంగా నల్లముట్టి, కొమ్ము, ఎర్రముక్కు, ఇరియోఫిడ్ నల్లి మొదలైన పురుగులు ఆశించి నష్టపరుస్తాయి. కొబ్బరి తోటల్లో పిందెలను ఉడతలు పాడుచేయడం అనేది సమస్యగా మారింది. దీంతో రైతులకు నష్టం తీవ్ర వాటిల్లుతోంది. ఉడతలు కొబ్బరి పిందెలను కొరికి, రసం పీల్చడం లేదా తినేస్తాయి. దీనిని అరికట్టడానికి గింజలను చెట్లకు కట్టడం, ఉచ్చులు పెట్టడం, విషపు ఎరలను వాడటం వంటి వాటిని సాధారణంగా రైతులు చేస్తుంటారు. ఉడతలు లేత కొబ్బరికాయలకు రంధ్రాలు చేసి లోపలంతా తినేస్తుంటాయి. దీంతో పైకి బాగానే కనిపించినా లోపల డొల్లగా మారుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానంలో కొబ్బరి చెట్లకు స్టీలు తొడుగులు (గిర్డిల్స్) ప్రయోగాత్మకంగా అమర్చి ఉడతల వల్ల పంటకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నారు.

కొబ్బరి పిందెలనే ఎందుకు పాడుచేస్తాయి..

ఉడతలు క్షీరదాలు తరగతికి చెందినవి. ప్రపంచవ్యాప్తంగా ఉడతలు 200 కంటే ఎక్కువ జాతులు ఉన్నప్పటికీ వాటిని ప్రధానంగా మూడు విభాగాలుగా వర్గీకరించారు. వాటిలో చెట్లపై నివసించేవి, నేలపై నివసించేవి, ఎగిరే ఉడతలు ఉన్నాయి. ఉడతలకు నిరంతరం ఆహారం అవసరం. ముఖ్యంగా శక్తిని ఇచ్చే కొబ్బరి పిందెలు వాటికి మంచి ఆహారం. ఉడతల సంతతి పెరిగేకొద్దీ ఆహార అవసరాలు పెరుగుతాయి. అందువల్ల అవి తోటలపై పడి దాడి చేస్తాయి. ఉడతలు శాఖాహారులు అయినప్పటికీ చాలా వరకు ఉభయచరుల్లా ప్రవర్తిస్తాయి. విత్తనాలు, గింజలు, పండ్లు, పుట్టగొడుగులు, పచ్చికాయలు, ఆకులను ఆహారంగా తీసుకుంటాయి. కొన్ని జాతుల ఉడతలు పక్షి గుడ్లు, చిన్న పెంకు పురుగులు, చిన్న సరీసృపాలను కూడా ఆహారంగా తీసుకుంటాయి. ఉడతలు ఆహారాన్ని దాచుకునే అలవాటు కలిగి ఉంటాయి. శీతాకాలం కోసం గింజలను నేలలో దాచిపెడతాయి. కొన్నిసార్లు అవి దాచిపెట్టిన స్థానాన్ని మరిచిపోవడంతో వాటి నుంచి కొత్త మొక్కలు వస్తాయి. ఆ విధంగా పర్యావరణ వ్యాప్తిలో కూడా అవి భాగస్వాములు అవుతాయి.

పక్వానికి వస్తున్న కాయలకు రంధ్రాలు..



కాయలు బాగా పెరిగి లోపల లేత కొబ్బరి గుజ్జు ఏర్పడుతున్న దశలో ఉడతలు దాడి చేస్తాయి. ఉడతలు తమ పదునైన దంతాలతో కాయలపై భాగంలో లేదా పక్క భాగంలో చిన్న రంధ్రాలు చేస్తాయి. ఇవి లోపలి గుజ్జు వరకు చొచ్చుకుపోతాయి.

వాణిజ్య విలువ తగ్గడం...

రంధ్రాలు చేయడం వల్ల కాయ పాడైపోయి నీరుగారిపోతుంది. ఈ విధంగా దెబ్బతిన్న కాయలకు మార్కెట్లో ఎలాంటి విలువ ఉండదు. ఉడతలు చేసిన రంధ్రాల ద్వారా గాలిలోని బ్యాక్టీరియా లేదా శిలీంద్రాలు (ఫంగస్) లోపలికి ప్రవేశించి కాయ మొత్తం కుళ్లిపోవడానికి దారితీస్తుంది.

పూత నాశనం..

కొన్ని సందర్భాల్లో ఉడతలు కొబ్బరి పూతను కూడా కొరికేస్తాయి. దీంతో కాయలు కట్టే అవకాశం లేకుండా పోతుంది. ముఖ్యంగా కొబ్బరి పంటలో ఉడతల నష్టాన్ని రైతులు సరిగా గమనించకపోతే అది కేవలం పిందెలు రాలిపోవడం లేదా తెగుళ్ల కారణంగా సంభవిస్తుందని అనుకుంటారు. కానీ చాలాసార్లు దగ్గరగా పరిశీలిస్తే కొరికిన గుర్తులు లేదా రంధ్రాలు కనిపిస్తాయి.



ఉడతలు కొట్టేసిన లేత కొబ్బరికాయలు

లేత కొబ్బరి పిందెలే లక్ష్యం...



ఉడతల కారణంగా కొబ్బరిలో ప్రధానంగా పిందె దశ, పక్వానికి కాయలు వస్తున్న దశలో నష్టం కలుగుతుంది. పూత దశ దాటి కాయగా మారుతున్న లేత కొబ్బరి పిందెలను ఉడతలు లక్ష్యంగా చేసుకుంటాయి. చిన్న పిందెలను కొరికి వాటి లోపల ఉన్న మృదువైన భాగాన్ని తింటాయి. దాడి కారణంగా పిందెలు తమ పోషణను కోల్పోయి పూర్తిగా పెరగకముందే చెట్టు నుంచి రాలిపోతాయి. దీనివల్ల దిగుబడి తగ్గిపోతుంది.

నివారణ

- కొబ్బరి చెట్లకు స్టీలు తొడుగులు (గిర్డిల్స్) ఏర్పాటుచేసుకోవడం ద్వారా అవి చెట్లు ఎక్కలేక జారిపోతాయి.
- కొబ్బరి పిందెలు ఉన్న గెలలకు సన్నటి వలలు లేదా ప్లాస్టిక్ కవర్లు కట్టడం వల్ల ఉడతలు వాటిని చేరలేవు.
- ఉడతలను పట్టుకోవడానికి ప్రత్యేకమైన ఉచ్చులు ఏర్పాటుచేయాలి.
- చెట్లు కాండం చుట్టూ జింక్ షీట్లు చుట్టడం వల్ల అవి చెట్టుపైకి ఎక్కడం కష్టమవుతుంది.
- ఆహారంలో విషపు ఎర కలిపి ఉంచాలి.
- తోటల్లో గుడ్లగూబలు వంటివి ఉండేలా చూసుకోవడం వల్ల ఉడతలను నియంత్రించవచ్చు.



చర్యలు

- బోనులు పెట్టి ఉడతలను పట్టుకోవడం, పట్టుకున్న ఉడతలను తోటలకు దూరంలో, అడవి ప్రాంతంలో వదిలివేయాలి.

ఉడతలు చురుగ్గా ఉండి వేగంగా కదులుతాయి. కాబట్టి వాటిని నివారించడానికి రక్షణ కంచెలు లేదా సంప్రదాయ పద్ధతులు పనిచేయవు. వ్యవసాయ శాఖ నిపుణులు చెట్టు కాండాలకు మెటల్ షీట్లు బిగించడం లేదా వేప నూనె పిచికారీ చేయడం వంటి పద్ధతులను పాటిస్తున్నారు. అయితే ఆర్థిక స్తోమత లేని రైతులు వీటిని అవలంబించలేకపోతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి ఉడతల నియంత్రణకు అవసరమైన సామగ్రిని రాయితీపై అందించాలని కోరుతున్నారు.

ప్రయోగాత్మకంగా స్టీలు తొడుగులు ఏర్పాటు చేశాం



ఉడతల బారి నుంచి కొబ్బరి చెట్లను రక్షించుకునేందుకు వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉన్న కొబ్బరి చెట్లకు స్టీలు తొడుగులు ఏర్పాటుచేశాం. ప్రయోగాత్మకం అమలుతో సత్ఫలితాలు వచ్చాయి. ఉడతలు కొబ్బరి చెట్లు ఎక్కడానికి ప్రయత్నం చేసినప్పటికీ స్టీలు కారణంగా వాటి కాళ్లకు పట్టు దొరక్క కిందకు జారిపోతున్నాయి. తద్వారా కొబ్బరి పిందెలు, పువ్వులను రక్షించుకునే వీలుకలిగింది.

డాక్టర్ ఇంజేటి సుధీర్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త
వ్యవసాయ పరిశోధనా స్థానం, పెద్దాపురం

ఉమ్మడి తూర్పులో 13న జాతీయ లోక్ అదాలత్

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: పీడీజే గంధం సునీత



రాజమహేంద్రవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ లోక్ అదాలత్‌లో రాజీకి అర్హమైన క్రిమినల్, సివిల్ కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్, ప్రమాదాలు, బ్యాంకులు, ప్రీ-లిటిగేషన్ కేసులతోపాటు ట్రాఫిక్ చలానా, ఎక్సైజ్‌కి సంబంధించి డ్యూపెయిడ్, నాన్ డ్యూటీ పెయిడ్ కేసులను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఇప్పటికే ఆ తరహా 18,035 కేసులను గుర్తించామన్నారు. ఉమ్మడి జిల్లాలో 46 న్యాయ పీఠాలను ఏర్పాటు చేశామన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పర్యవేక్షణలో ప్రతి మూడు నెలలకు ఒకసారి దేశవ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నారన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించడం, తక్కువ ఖర్చుతో న్యాయం అందడం, రాజీ ద్వారా చట్టపరమైన వివాదాలకు ముగింపు, రాజీపడిన కేసులకు కోర్టు ఫీజు తిరిగి ఇచ్చేయడం, ఈ తీర్పులను తుది తీర్పులుగా పరిగణించడం వల్ల ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుందన్నారు. 2024లో 4 జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించగా 10,623 కేసులకు పరిష్కారం లభించిందన్నారు. బాధితులకు రూ.162కోట్ల 35లక్షల 24వేల 590 పరిహారం అందిందని చెప్పారు.అలాగే ఈ ఏడాది ఇప్పటి వరకూ జరిగిన 3 జాతీయ లోక్ అదాలత్‌లలో 17,073 కేసులకు పరిష్కారం లభించగా.. రూ.100కోట్ల 99లక్షల 11వేల 504 పరిహారాన్ని బాధితులు అందుకున్నారని పీడీజే గుర్తు చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ఎస్‌కేఆర్‌కు పసిడి పంట

రాష్ట్ర స్థాయి పోటీల్లో 6 గోల్డ్ మెడల్స్‌తోపాటు ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్ కైవశం



మెడల్స్ సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మార్షల్ ఆర్ట్స్(ఉష) ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఈ నెల 8,9 తేదీల్లో జరిగిన ఇండియా స్టేట్ ఉమెన్స్ లీగ్ 2025-2026 పోటీల్లో స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు పసిడి పంట పండించారు. ఆరు గోల్డ్ మెడల్స్‌తోపాటు ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కె.సత్యవేణి, కె.జీవన్, కె.కుసుమ, కె.మహాసుహాసిని, ఎం.భార్గవి, జి.కృష్ణవేణి గోల్డ్‌మెడల్స్ సాధించగా స్వర్ణలత సిల్వర్ మెడల్, రాజ్యలక్ష్మి, పావని బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ రాఘవకుమారి తెలిపారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థినులు జనవరిలో ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే నేషనల్ ఉమెన్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థినులను ఆమె అభినందించారు.

13న 1008 మందితో వందేమాతరం గీతాలపన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న తోట సుబ్బారావు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థుల్లో తెలుగు భాష పట్ల మమకారం పెంచేందుకు 1008 మంది విద్యార్థులతో శతక పద్య సహస్రాధిక గళ ధారణ, వందేమాతర గీతాలాపన కార్యక్రమం, పెరవలి మాతృభాషా పరిరక్షణ సమితి, ఆంధ్ర కేసరి యువజన సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గోదావరి గట్టున ఉన్న చాంబర్ భవనంలో జరుగుతుందని సమన్వయకర్తలు సీహెచ్‌సీ నాగభూషణం, దేశిరెడ్డి బలరామనాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సరస్వతీ ఘాట్‌లో ఆధ్యాత్మికవేత్త తోట సుబ్బారావు బుధవారం ఆవిష్కరించారు.కార్యక్రమంలో మాదిరాజు శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ, రఘుపాత్రుని సాయిబాబా పాల్గొన్నారు.

ఘనంగా కేశవస్వామి

పవిత్రోత్సవాలు



మహాసనపం నిర్వహిస్తున్న పండితులు

ఆత్రేయపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పురాన ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు రెండో రోజు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్రోత్సవ పూజలు, ఉత్సవమూర్తులకు మహాస్నపనం, శాంతి హోమం, సాయంత్రం పంచపవిత్రాల ఊరేగింపు, పంచ సయ్యాధివాసం, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీనివాసుల వెంకటాచార్యుల బ్రహ్మత్వంలో నిర్వహించారు. ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో బీహెచ్‌వీ రమణమూర్తితోపాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఎస్ఐఎఫ్‌టీలో సిలబస్ మార్పునకు కమిటీ

కాకినాడ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (ఎస్ఐఎఫ్‌టీ)లో ప్రస్తుతం కొనసాగుతున్న కోర్సులపై మూల్యాంకనం చేపట్టి కొత్తగా సిలబస్ రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర మత్స్య శాఖ జీవోఆర్‌టీ నెంబర్ 414 జారీ చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా ఫిష రీస్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ వ్యవహరించనున్నారు.మెంబర్ కమిటీ కన్వీనర్‌గా ఎస్ఐ ఎఫ్‌టీ ప్రిన్సిపాల్ కొనసాగుతారు.కమిటీలో సభ్యులుగా 9 మందిని నియమించగా, అందులో కాకినాడ నుంచి ఎఫ్ఆర్ఎస్ ఓఎస్‌డీ సభ్యుడిగా ఉన్నారు.ఈ కమిటీ ఎస్ఐఎఫ్‌టీలో 6 నెలల కోర్సులకు సంబంధించి సమీక్షలు జరిపి మార్పులు,చేర్పులు సూచించనుంది.

డ్రంకెన్ డ్రైవ్‌కు మూడ్రోజుల జైలు

బిక్కవోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో గ్రామానికి చెందిన జమ్ము శివ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. దీంతో అతడిని బుధవారం అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా మూడు రోజులు జైలు శిక్ష విధించారన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోటి బిల్వార్చన



వేద పండితుడు కృష్ణమూర్తిని సత్కరిస్తున్న స్పీకర్ అయ్యన్న, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల, గోరంట్ల, ఎమ్మెల్సీ సోము

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- పెదపర్తిలో ముగిసిన పూజలు
- పార్వతీరామలింగేశ్వరుల కల్యాణం

అనపర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న కాంక్షతోనే కోటి బిల్వార్చన నిర్వహించినట్టు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. అనపర్తి మండలం పెదపర్తిలోని పార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేద పండితుడు యలమంచిలి కృష్ణమూర్తి నేతృత్వంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో 41రోజుల పాటు రుద్రయాగ, నవ చండీయాగ, నవగ్రహ యాగ సహిత మహా కోటి బిల్వార్చన, కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల చివరి రోజైన బుధవారం ఉదయం నుంచి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో అయ్యన్న పద్మావతి దంపతులతో బాటు ఆయన కుమారులు కోడళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పార్వతి రామలింగేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రం దొంగలపాలైందని ప్రస్తుతం ప్రగతి పథంలో పయనిస్తుందని, రాబోయే రోజుల్లో దుష్ట శక్తుల పాలు కాకుండా కాపాడాలని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని మోదీ, రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వంటి నేతలు క్షేమంగా ఉండాలని ఈ కార్యక్రమాలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేద పండితుడు యలమంచిలి కృష్ణమూర్తిని అయ్యన్నతోపాటు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజుల చేతుల మీదుగా సత్కరించారు. అలాగే వేద పండితులను సన్మానించారు. అనంతరం అయ్యన్నను ఎమ్మెల్యే నల్లమిల్లి సత్కరించి మెమొంటోను అందజేశారు.కార్యక్రమంలో ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్, వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రొయ్యల ఎగుమతుల్లో కాకినాడ-గోదావరి కీలకం

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు



కాకినాడ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రొయ్యల ఉత్పత్తిలో ముఖ్య కేంద్రంగా నిలిచిన కాకినాడ-గోదావరి ప్రాంతం ఎగుమతుల్లో మరింత కీలక పాత్ర పోషించనుందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. దేశంలో ఆక్వా రంగం వృద్ధి,మార్కెట్ విస్తరణ, మత్స్యకారుల ఆర్థిక బలోపేతం, దక్షిణ భారత ఆక్వా ఉత్పత్తుల తక్షణ రవాణా సౌకర్యాల ప్రాముఖ్యతపై బుధవారం రాజ్యసభలో ఎంపీ సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు కేంద్రం సమగ్ర నివేదిక అందించింది. 2024-25లో భారత్ రూ.62.408 కోట్ల విలువైన 16.98 లక్షల టన్నుల సముద్ర ఆహార ఉత్పత్తులను 130 దేశాలకు ఎగుమతి చేసిందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ వెల్లడించారు. కొత్త మార్కెట్ల విస్తరణ, విలువ జోడింపుపై కేంద్రం చేపట్టిన చర్యల వల్ల కాకినాడ నుంచి రొయ్యల ప్రాసెసింగ్, ఎగుమతి యూనిట్లకు అవకాశాలు పెరగనున్నాయని తెలిపారు. జీఎస్టీ తగ్గింపుతో విలువ ఆధారిత ఉత్పత్తులకు, స్థానిక ప్రాసెసింగ్ యూనిట్లకు లాభం చేకూరే అవకాశం ఉందన్నారు. కొత్త మార్కెట్ల విస్తరణకు ఎంపెడా ద్వారా అవగాహన కార్యక్రమాలు, కొనుగోలు- అమ్మకందార్ల సమావేశాలు, విలువ జోడింపుపై శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కేంద్ర మంత్రి వెల్లడించారు.

వందేమాతరం చర్చలో.. వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఎంపీ సతీష్‌బాబు ప్రసంగించారు. ఆయన వందేమాతరం గీతం చరిత్ర, భారత స్వాతంత్ర్య సమరంలో దాని పాత్ర, తన స్వస్థలం కాకినాడతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. బకించంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో లక్షలాది మందికి ప్రేరణగా నిలిచిందన్నారు. కాకినాడలో 1923లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభల్లో వందేమాతరం గీతంపై అభ్యంతరంతో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మౌలానా మహమ్మద్ ఆలీ జౌహార్ బయటకు వెళ్లిపోవడం బాధాకర అధ్యాయంగా మిగిలిందన్నారు. అదే ఘటనకు శతాబ్దం తర్వాత చరిత్ర ఇచ్చిన సమాధానంగా ఈ ఏడాది నవంబరు 7న కాకినాడలోని మౌలానా మహమ్మద్ ఆలీ వీధికి వందేమాతరం మార్గ్ అని పేరు పెట్టిన విషయాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు తనకు ఈ చర్చలో మాట్లాడే అవకాశం కల్పించారని సతీష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర కళాశాలల ఫుట్‌బాల్ విజేతగా కాకినాడ ఐడియల్



ఫుట్‌బాల్ ట్రోఫీతో ఐడియల్ కళాశాల విద్యార్థులు

కాకినాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర కళాశాలల ఫుట్‌బాల్ విజేతగా కాకినాడ ఐడియల్ కళాశాల విద్యార్థులు ట్రోఫీని కైవసం చేసుకున్నారు. రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10వ తేదీల్లో నిర్వహించిన అంతర కళాశాలల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఐడియల్ కళాశాల జట్టు పాల్గొంది. బుధవారం జరిగిన ఫైనల్ పోటీలో ఐడియల్ కాలేజీ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచడంతో ప్రథమ స్థానం సాధించి అంతర కళాశాలల ఫుట్‌బాల్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ జట్టు సభ్యులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సత్యనారాయణ, డైరెక్టర్స్ ఎం.రంజిత్, కేఎస్ వాసు, పీడీ పెమ్మాడి శ్రీను క్రీడాకారుల్ని అభినందించారు.

క్రీడా సంబరం...



- జేఎన్టీయూకేలో సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలు
- ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు
- కాకినాడ జిల్లాలో 3చోట్ల టోర్నమెంట్
- ఈ నెల 14 వరకూ నిర్వహణ
- మొదటి రోజు 40 మ్యాచ్‌లు



బెలూన్లు వదిలి పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

జేఎన్టీయూకే, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో అసోషియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయూ) సహకారంతో వర్శిటీ మైదానంలో సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జేఎన్టీయూకే, సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, అచ్చంపేటలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ సంయుక్తంగా నిర్వహించే వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే, ఏపీ వాలీబాల్ సంఘ అధ్యక్షులు, వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు పి.గణవెంకట రెడ్డినాయుడు(గణబాబు) ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. వర్శిటీ క్రీడా మైదానంలో ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, అర్జున అవార్డు గ్రహీత, మాజీ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పి.వెంకటరమణ, గౌరవ అతిథులుగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఏఐయూ పరిశీలకులు డాక్టర్ ఈ.త్రిమూర్తులు హాజరయ్యారు. ఈనెల 14 వరకూ జరిగే ఈ టోర్నమెంట్‌లో సుమారుగా 138 జట్లు పాల్గొంటున్నాయి. పోటీలను 4పూల్స్‌గా విభజించారు. పూల్ ఏ, బీ పోటీలు జేఎన్టీయూకే మైదానంలో, పూల్ సీ పోటీలు అచ్చంపేటలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లో, పూల్ డీ లోని జట్లకు సంబంధించిన పోటీలు సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్నాయి. జ్యోతి ప్రజ్వలన అనంతరం అతిథులు జాతీయ జెండాను, క్రీడాపతాకాన్ని ఆవిష్కరించి పోటీల్లో పాల్గొంటున్న జట్ల క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

ఉత్తమ ప్రతిభ కనబరచాలి...

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ క్రీడాకారులకు అభినందనలు తెలిపి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కాకినాడ జిల్లాలో ఎంతో సుందరమైన టూరిస్టు ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. ఏఎస్పీ మాట్లాడు తూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడాకారులు తమపై తాము నమ్మకం ఉంచుకుని బాగా రాణించినపుడే విజయం సాధించవచ్చని తెలిపారు. వీసీ మాట్లాడుతూ కాకినాడ జేఎన్టీయూకే వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహణ బాధ్యతలను అప్పగించిన ఏఐయూకు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులు, అధికారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. టోర్నమెంట్‌లో మొదటిరోజు 40మ్యాచ్‌లు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్డీ కోటేశ్వరరావు, వర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి, టోర్నమెంట్ కన్వీనర్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ జీపీ రాజు, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, మాజీ వీసీలు ప్రసాదరాజు, పద్మరాజు డైరెక్టర్లు కృష్ణమోహన్, బీటీ కృష్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, పీడీలు వెంకటేశ్వరరావు ఉన్నారు.

క్రమశిక్షణ అవసరం...

ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో ఆడి ఉత్తమ ప్రతిభ చూపాలన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుం చి వచ్చిన క్రీడాకారులు, జట్ల మేనేజర్లకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా జేఎన్టీయూకే ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు కల్పించడం జ రిగిందన్నారు. క్రీడాకారులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని దీని ద్వారా చదువులోనూ, క్రీడల్లోనూ రాణించగలరని తెలిపారు. వెంకటరమణ మాట్లాడుతూ వాలీబాల్ క్రీడాకారులు కష్టపడి ఆడుతూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అంతేకాకుండా కష్టపడి ఆడినవారు ఎప్పటికైనా విజయం సాధిస్తారన్నారు.





వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న అధికారులు



ఆహారం రెడీమేడ్!

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

పక్షులకు ఆహారం పెట్టడానికి ధాన్యం కుచ్చులను ఇళ్ల వద్ద ఏర్పాటు చేస్తుంటారు. అయితే వాటిని రెడీమేడ్ దుస్తుల్లా సిద్ధం చేసి అమ్మేస్తున్నారు. కాకినాడలో సైకిల్‌కు ధాన్యం కుచ్చులను తగిలించి విక్రయాలు చేస్తున్న దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి కెమెరా' క్లిక్ మనిపించిందిలా...

అన్నవరం దేవస్థానం ఈవోగా త్రినాథరావు బాధ్యతల స్వీకరణ

భక్తులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని ఆలయ సిబ్బందికి సూచన

అన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా నియమితులైన వేంద్ర త్రినాథరావు బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా స్వామిని దర్శించుకున్న ఆయన అనివేటి మండపంలో ఇప్పటివరకు ఈవోగా ఉన్న వీర్ల సుబ్బారావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సుబ్బారావుకు వీడ్కోలు పలికి త్రినాథరావుకు స్వాగతం పలికారు. అనంతరం ఈవో కార్యాలయంలో త్రినాథరావు సిబ్బందితో సమావేశమయ్యారు. గతంలో మూడు పర్యాయాలు అన్నవరం దేవస్థానం ఈవోగా పనిచేసిన అనుభవంతో సిబ్బందితో ఎటువంటి పరిచయ కార్యక్రమం లేకుండానే పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో భక్తుల అసంతృప్తి శాతం అధికంగా ఉండడంతో అన్నవరం దేవస్థానం ఆరోస్థానానికి పరిమితమయిన సంగతి తెలిసిందే. అయితే భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ వారి సందేహాలను విసుగుచెందకుండా నివృత్తి చేయాలని, సిబ్బంది సమష్టిగా పని చేస్తే మొదటిర్యాంక్ రావడం పెద్ద కష్టమేమి కాదని సూచించారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు, ఈఈ రామకృష్ణ, పీఆర్వో అనకాపల్లి ప్రసాద్, ఏఈవోలు సూపరెంటెండెంట్‌లు పాల్గొన్నారు.



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న త్రినాథరావు

బైక్‌లు కొట్టేసి... డబ్బులతో జల్సాలు చేసి!

రాజమహేంద్రవరంలో ముగ్గురు దొంగల అరెస్ట్

రూ.17.40 లక్షల విలువైన 29 ద్విచక్రవాహనాల స్వాధీనం





వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్... నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేస్తున్న ద్విచక్రవాహనాలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం నగరానికి వచ్చాడు. చిన్న పనిలో కుదిరాడు. కష్టపడుతూ బతుకుతున్నాడు. ఓ రోజు బైక్ నడపాలనే కోరికతో మారుతాళంతో ప్రయత్నించగా ఫలించింది. డబ్బులు బాగా వస్తుండడంతో బుద్ధి వక్రించి ద్విచక్ర వాహనాల దొంగగా మారాడు. ఆ డబ్బులతో జల్సాలు చేశాడు. ఆపై పోలీసుల వలకు చిక్కడంతో అతడితోపాటు దొంగతనం చేసిన వాహనాలు కొనుగోలు చేసిన ఇద్దరిని కటకటాల్లోకి నెట్టారు. బుధవారం సెంట్రల్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు.

హోటల్‌లో నైట్‌బాయ్‌గా చేరి...

తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరుపేటకు చెందిన సబ్బు వీరబాబు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. అమ్మమ్మ దగ్గర పెరిగాడు. తర్వాత రాజమహేంద్రవరం వచ్చి పుష్కర్‌ఘాట్ సమీపంలోని ఓ హోటల్‌లో నైట్‌బాయ్‌గా ఉద్యోగంలో చేరాడు. పగలు వెల్డింగ్ పనులకు వెళ్లేవాడు. అయితే ఒక రోజు బైక్ నడపాలని అనుకున్నాడు. కానీ కొనుక్కొనే పరిస్థితి లేదు. దీంతో పుష్కర్ ఘాట్ వద్ద పార్క్ చేసిన ఓ మోటార్ సైకిల్‌ని మారు తాళంతో ప్రయత్నించగా పని జరిగింది. కొంత కాలం ఆ బైక్‌ని వాడుకున్నాడు. తర్వాత స్నేహితులైన కోసూరి పవన్ కుమార్, జర్గాని అప్పన్నకు అమ్మేశాడు. ఆ డబ్బులతో జల్సాలు చేశాడు. అదే పని బాగుందనుకుని ద్విచక్ర వాహనాల దొంగగా మారాడు. పుష్కర్‌ఘాట్, కోటగుమ్మం, మల్లయ్యపేట, సుబ్రహ్మణ్య మైదానం, లాలాచెరువు రోడ్, ఇస్కాన్ దేవాలయం, వాడపల్లి గుడి ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగిలించాడని డీఎస్పీ వివరించారు. వీరబాబుతో పాటు కొయ్యూరు మండలం మఠం భీమవరం గ్రామానికి చెందిన పవన్‌కుమార్, గోకవరం మండలం అచ్యుతాపురానికి చెందిన అప్పన్నని అరెస్టు చేసి రూ.17.40 లక్షల విలువైన 29 ద్విచక్ర వాహనాల స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ద్విచక్ర వాహనాలకు యజమానులు వీల్ లాక్‌లు, జీపీఎస్‌లు అమర్చుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని త్రీటౌన్ సీఐ వీ.అప్పారావు సూచించారు. దొంగలను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ వి.అప్పారావు, ఎస్ఐ ఎండీ జుబేర్, హెచ్‌సీలు వీ.కృష్ణ, ఎస్.వెంకట రామయ్య, ఎస్.చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు బి.విజయ్ కుమార్, కె.పవన్ కుమార్, ఆర్.సుబ్రహ్మణ్యాన్ని ఎస్పీ నరసింహకిశోర్ ప్రత్యేకంగా అభినందించారు.


సూసేకి అగ్గిరవ్వ మాదిరి...

సూరీడు.. అగ్గిరవ్వ మాదిరి కనిపించాడు. శివలింగంపై ఎర్రటి తేజస్సును కురిపించాడు. గోదావరిపై తన కాంతిని ప్రసరింపజేశాడు. రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద కనిపించిన ఈ అద్భుతమైన దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి కెమెరా' ఒడిసిపట్టిందిలా...

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం







రత్నగర్భ గణపతి ఆలయంలో చోరీ

రూ.10 లక్షల విలువైన 7 కిలోల వెండి ఆభరణాలు దోచుకెళ్లిన దుండగులు



ఆలయం వద్ద పరిశీలిస్తున్న ఎస్ఐ మౌనిక

పెద్దాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం ఆర్‌బీ పట్నంలోని రత్నగర్భ గణపతి ఆలయంలో బుధవారం భారీ చోరీ జరిగింది. రాఘవమ్మ చెరువు గట్టు సమీపంలో ఉన్న ఈ ఆలయాన్ని గ్రామస్తులు పునర్నిర్మించారు. మంగళవారం అర్ధరాత్రి ఆలయంలోకి దొంగలు చొరబడి స్వామివారికి కిరీటం, కలశం, చిన్న వినాయక విగ్రహం దోచుకెళ్లినట్టు గ్రామస్తులు తెలిపారు. స్వామివారికి నిత్యం అలంకరించబడి ఉండే 7 కిలోల వెండి వస్తువులు విలువ సుమారు రూ.10 లక్షల వరకూ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు సమకూర్చిన ఈ వెండి ఆభరణాలు చోరీకి గురికావడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. అలాగే ఈ చోరీ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. ఆలయంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో సమీపంలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పోలీసు జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

రంపచోడవరం/గంగవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా గంగవరం మండలంలో టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకులు బుధవారం సాయంత్రం కత్తితో దాడి చేసి గాయపర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. పిడతమామిడి గ్రామానికి చెందిన రెడ్డి వేణుగోపాల్ రెడ్డి టీడీపీ కార్యకర్త. పంచాయితీ ఎన్నికలకు అందరినీ సన్నద్ధం చేస్తున్న పరిణామంలో స్థానికంగా ఉండే వైసీపీ నాయకులకు ఓర్వలేక వేణుగోపాలరెడ్డితో ఘర్షణకు దిగారు. యెజ్జు వెంకటేశ్వరరావు, యెజ్జు రామకృష్ణ, తుమ్మల చిట్టిబాబు, బలిజ వీరబాబు, జగ్గు నూకరాజు వేణుగోపాలరెడ్డిపై దాడి చేసి గాయపర్చారు. రామకృష్ణ కత్తితో దాడి చేయగా వేణుగోపాలరెడ్డి చేతికి గాయమైంది. దీంతో ప్రాణాలను కాపాడుకోవడానికి అక్కడి నుంచి పారిపోయి, పిడతమామిడి పీహెచ్‌సీకి చేరుకుని వైద్యం అనంతరం దాడి విషయాన్ని మండలంలో టీడీపీ నాయకులకు అందించారు. వారు బాధితుడ్ని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం రాత్రి బాధితుడ్ని పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధ్యులపై తగు చర్యలను తీసుకోవాలని పోలీసులను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ ఎదుగుదలను సహించలేని వైసీపి ఎమ్మెల్సీ అనంతబాబు తన నాయకులతో ఇటువంటి దాడులకు పురిగొల్పుతున్నాడన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలను తీసుకుని తమ కార్యకర్తలకు, నాయకులకు అండగా నిలుస్తామని తెలిపారు.

స్విమ్మింగ్ పోటీల్లో యానాం విద్యార్థికి కాంస్యం



తోటి క్రీడాకారులతో వెంకటనాగసాయి

యానాం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానాంశాఖ విద్యార్థి ప్రతిభ చాటి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడని సెంటర్ ఇన్‌చార్జ్ ఉదయ్‌కుమార్ తెలిపారు. సౌత్ ఆఫ్రికాలోని మోసల్‌బే జరిగిన యూఐపీఎమ్ బైతేల్-ట్రైతేల్ లెజర్ వరల్డ్ చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో అండర్-15 విభాగంలో యానాం సాయ్ విద్యార్థి వీసం వెంకటనాగసాయి ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

గండేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మండలంలోని మురారిలో బుధవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు తెలిపారు. మృతదేహంపై ఎటువంటి దెబ్బలు లేవన్నారు. వయస్సు 70 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచామని ఆచూకీ తెలిసిన వారు 9440904841, 9440796529లో సంప్రదించాలని కోరారు.



చెట్లను కొట్టేయాల్సిందేనా?

సజీవంగా వేరే ప్రాంతాలకు తరలించవచ్చంటున్న స్థానికులు

అటవీశాఖ అధికారులు చొరవ చూపాలని అభ్యర్థన



చెట్టును నరికి కలపను వ్యాన్‌పై తరలిస్తున్న దృశ్యం

ఆలమూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి కూరగాయల మార్కెట్ నుంచి చొప్పెల్ల లాకుల వరకు 3.1కిలోమీటర్ల సర్వీసు రోడ్డు నిర్మిస్తున్నారు. దీని నిమిత్తం ఈ రోడ్డులో హైవే పక్కగా ఉన్న వివిధ వయసుల్లో ఉన్న 96 చెట్లను నరికివేస్తున్నారు. దీనికి నేషనల్ హైవే అధికారుల అభ్యర్థనకు అటవీశాఖ అధికారులు అంగీకరించారు. వీటి తొలగింపునకు ధరలు నిర్ణయించి అనుమతులు ఇచ్చారు. ఆ ప్రకారం ఎన్‌హెచ్ అధికారులు వేలంపాటలు నిర్వహించి చెట్లు తొలగించడానికి ఒక వ్యక్తి అప్పగించారు. వా టిని ముక్కలుగా నరికి కట్టెలుగా మాత్రమే తరలించాలని అధికారులు ఆదేశించారు. కళ్లముందు పెరిగిన చెట్లను ఇలా నరికేయడం బాధ కలిగిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని సజీవంగా వేరేచోటకు తరలించి బతికించవచ్చని, కడియం నర్సరీ రైతులు ఈ తరహాలో ప్రత్యేక యంత్రాలతో సజీవంగా వేరే ప్రాంతాలకు తరలిస్తున్నా రని వారు చెప్తున్నారు. కానీ ఇలా సజీవంగా చెట్లు తరలించడానికి వాల్టా చట్టం ఒప్పుకోదని, అందువల్ల ఎవరూ వీటిని తరలించే ఏర్పాటు చేయొద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పైగా, ఇలా అనుమతి ఇస్తే నర్సరీల వాళ్లు ఇతర ప్రాంతాల్లో కూడా చెట్ల ను తరలిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అలా ఐతే, అటవీశాఖ అధికారుల పర్యవేక్షణలోగానీ, వేరే ఇతర సంస్థలకు అప్పగించి గానీ చెట్లను సజీవంగా ఇతర ప్రాంతాలకు తరలించి బతికించాలని వాటితో అనుబంధం ఉన్న స్థానికులు కోరుతున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మరిడమ్మకు పంచామృత అభిషేకం

పెద్దాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జన్మ నక్షత్రం మఖను పురస్కరించుకుని బుధవారం వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి, సిబ్బంది రమణ, క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతి పొందిన ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్

'చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి'

కరప, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చేసిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని, ప్రతి ఉద్యోగీ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు సూచించారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి పొందిన పినిశెట్టి వీరభద్రరావు, పీఎస్‌వీఆర్ బ్రహ్మానందం, గ్రేడ్-1 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి పొందిన పినిశెట్టి ఉమామహేశ్వరి, యు.నిర్మలాదేవి, ఎం.సురేష్‌లను కరప చంద్రన్న సమావేశ మందిరంలో బుధవారం సత్కరించి అభినందనలు తెలిపారు. ఎంపీడీవో జటావల్లభుల శ్రీనివాస్, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీవో రాయి ప్రభాకరరావు, డిప్యూటీ ఎంపీడీవో కర్రి శ్రీనివాసరావు, ఏవో బీఎల్ నరసింహం, సహచర కార్యదర్శులు, మండల పరిషత్, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

18న కాకినాడలో బీసీ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం

కాకినాడ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని వీర్‌కమల్ థియేటర్‌లో ఈ నెల 18న బీసీ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యనమదల రవి వెల్లడించారు. బుధవారం భానుగుడి సమీపంలోని రాష్ట్ర బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సినీ నటుడు సుమన్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శొంఠి నాగరాజు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. వివిధ బీసీ సంఘాల ఆధ్వర్యంలో కాకినాడలోని హోటల్ జీఆర్టీ గ్రాండ్ నుంచి విద్యుత్ నగర్‌లోని సమావేశ ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. బీసీ సీనియర్ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పెంకే రాజు, నాయకులు విత్తనాల వెంకటరమణ, కొండా వినాయక్, పెంకే వెంకటలక్ష్మి, వేణుగోపాల్, శాంతి, పెంకే శివ, వాసంశెట్టి మహేష్, దొడ్డి వీరేంద్ర, శివరామకృష్ణ, వీరభద్రరావు, పాలిక చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి కుంతీమాధవుని ధనుర్మాస మహోత్సవాలు

పిఠాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతూ పట్టణంలో వేంచేసియున్న కుంతీమాధవస్వామి వార్షిక ధనుర్మాస మహోత్సవాలు ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది జనవరి 14 వరకు జరగనున్నాయి. వైఖానసాగమోక్తం ప్రకారం స్వామికి, గోదా అమ్మవారికి, ఆళ్వార్లకు సేవలు, విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. 16వ తేదీ ఉదయం 5.30 గంటలకు అభిషేకం, ధనుర్మాసం ప్రారంభం, స్వామి, గోదా అమ్మవార్లకు పంచామృతాభిషేకం, శ్రీచూర్ణం అర్చనలు, ద్రవిడ ప్రబంధ పారాయణ నివేదనలు, రాత్రి గోదా అమ్మవారి మాడ వీధి సేవ జరుగుతాయి. ప్రతిరోజూ తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వామికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, గోదా అమ్మవారికి చూర్ణం అర్చనలు, ద్రవిడ ప్రబంధపారాయణ (తిరుప్పావై), రాత్రి పాశుర విన్నపం నిర్వహిస్తారు. జనవరి 11న కూడార్, 14న పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, రాత్రి గోదా అమ్మవారి కల్యాణం, ధనుర్మాసం ముగింపు జరుగుతాయి. ఈ నెల 30న ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, వైకుంఠద్వార దర్శనం జరుగుతాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట నుంచే పూజలు, సర్వదర్శనాలు ప్రారంభమవుతాయి.

ఈ నెల 30 నుంచి జనవరి 8 వరకు అధ్యయనోత్సవాలు, జనవరి 8న నమ్మాళ్వార పరమపదోత్సవం, జనవరి 10 నుంచి 14వ తేదీ వరకు వార్షిక నీరాటోత్సవం నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈవో నున్న శ్రీరాములు, కుంతీమాధవస్వామి భక్త బృంద సభ్యులు కోరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

జీవామృతాల తయారీపై అవగాహన

పెదపూడి (కరప), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట టీటీడీసీలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్), రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) సంయుక్తంగా ఐదు రోజుల నేచురల్ ఫార్మింగ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు జె.ఎలియాజర్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణలో రెండో రోజైన బుధవారం శిక్షణార్థులు పెదపూడి మండలం రామేశ్వరంలోని ప్రకృతి రాగ నేచురల్ బయో ఇన్‌పుట్స్ సెంటర్‌ను సందర్శించారు. ద్రవ జీవామృతం, బీజామృతం, మట్టి ద్రవణం, నీమాస్త్రం, ఎగ్ అమినో యాసిడ్ తయారీ విధానం, వినియోగం, ప్రయోజనాను ప్రయోగాత్మకంగా తెలుసుకున్నారు. ఐదు లేయర్ మోడల్‌ను పరిశీలించి ఒకే భూమిలో విభిన్న పంటల సమగ్ర పెంపకం వల్ల ఖర్చు తగ్గడం, జీవవైవిధ్యం పెరగడం వంటి ప్రయోజనాలు ఎలా కలుగుతాయనే అంశాలపై అవగాహన కల్పించారు.

కాకినాడ జిల్లాలో అమలుచేస్తున్న రింగ్ మోడల్, డైమండ్ మోడల్ వంటి ఇన్నోవేషన్ పద్ధతులను డెమో రూపంలో వివరించి ప్రకృతి వ్యవసాయంలో వాటి ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకున్నారు. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరం సత్యవతీదేవి కళాశాలలో ఘనంగా నోబెల్ డే

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురం అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నోబెల్ డే నిర్వహించారు. జగ్గంపేట ప్రభుత్వ కళాశాల, పీఆర్ కళాశాల, ఐడియల్ కళాశాల విద్యార్థులు మోడల్స్ ప్రదర్శించారు. జగ్గంపేట కళాశాల బీఎస్సీ కెమిస్ట్రీ విద్యార్థినులు పద్మశ్రీ, వీరలక్ష్మి (ప్రథమ), అన్నవరం సత్యవతీదేవి మహిళా డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విద్యార్థినులు ధరహాసిని, సుప్రియ (ద్వితీయ), ఐడియల్ కళాశాల ఎమ్మెస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు రూప, భూమిక (తృతీయ) బహుమతులు పొందారు.

వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనంతలక్ష్మి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ వసంతలక్ష్మి అభినందించారు. న్యాయనిర్ణేతలుగా అధ్యాపకులు మల్లికార్జునశర్మ, పావని, సూర్యనారాయణ దేవర వ్యవహరించారు. కార్యక్రమంలో పి.లీనా, అనిత, రూన్సీ, లక్ష్మి, సుబ్బలక్ష్మి, సులక్షణ పాల్గొన్నారు.

'ప్రాకార మండపం పనులను నాణ్యతతో నిర్వహించాలి'

గొల్లప్రోలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని సీతారామస్వామి దేవస్థానం (విష్వాలయం)లో రూ.1.32 కోట్ల వ్యయంతో జరుగుతున్న ప్రాకార మండపం పనులను దేవదాయ శాఖ ఈఈ దుర్గేష్ బుధవారం తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న తీరును పరిశీలించి నాణ్యతతో నిర్వహించాలని సూచించారు. పునాదులను గ్రావెల్‌తో నింపుతున్నారని, దానిని తొలగించి ఇసుకతో నింపాలని స్థానికులు కోరారు. కాగా బొండు ఇసుక లభ్యత లేని కారణంగా ఇంజనీరింగ్ అధికారుల సూచనలతో గ్రావెల్‌తో ఫిల్ చేస్తున్నామని ఈవో టీవీ సూర్యనారాయణ తెలిపారు.

నర్సింగ్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో జీఎన్ఎం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసు వాంగ్మూలంలో అతడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ అశోక్‌నగర్‌కు చెందిన 23 ఏళ్ల కర్రి ధర్మతేజ జీజీహెచ్‌లోని వసతి గృహంలో ఉంటూ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో చదువుతున్నాడు. అతడితో ప్రిన్సిపాల్ విమల నర్సింగ్ స్కూలుకి సంబంధించిన కంప్యూటర్ వర్క్ చేయిస్తోంది. కంప్యూటర్ పరికరాలు చోరీకి గురయ్యాయన్న ఆరోపణలతో ధర్మతేజను తప్పించి తృతీయ సంవత్సరం చదువుతున్న మరో విద్యార్థికి వర్క్ అప్పగించారు. తాను ఆ పనిని చేయలేనంటూ అతడు తప్పుకున్నాడు. దాంతో ప్రిన్సిపాల్ తిరిగి ధర్మతేజను పిలిచి కంప్యూటర్ వర్క్ చేయాలని ఆదేశించింది. తనపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వర్క్ చేయనని ధర్మతేజ కరాకండిగా చెప్పాడు. దాంతో కోపోద్రిక్తురాలైన ప్రిన్సిపాల్ నీకు పరీక్షల్లో మార్కులు వేయాల్సింది నేనేనంటూ ఆ యువకుడిని బయపెట్టింది. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన ధర్మతేజ హాస్టల్‌లోని తన గదిలోకి వెళ్లి పది నిద్ర మాత్రలు మింగి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. క్లాస్ నుంచి వచ్చిన సహ విద్యార్థులు గమనించి జీజీహెచ్ అత్యవసర విభాగానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం బాధిత యువకుడిని మెడికల్ విభాగంలోని ఏఎంసీయూ-1కు తరలించి చికిత్స చేస్తున్నారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కాకినాడ ఐడియల్ కళాశాలలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మి



సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురం పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

'బాల్య వివాహాలు సాంఘిక దురాచారం'

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆధ్వర్యంలో నగరంలోని ఐడియల్ డిగ్రీ కాలేజీలో బాల్య వివాహ ముక్త్ భారత్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహ నిరోధ చట్టం-2006 ప్రకారం బాల్య వివాహాలు సాంఘిక దురాచారం, నేరం అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించిన, సహకరించిన వారిపై పోక్సో చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ జరిపి మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కామరాజు, జిల్లా బాలల పరిరక్షణ అధికారులు కె.శ్రీనివాసరావు, జె.విజయ, క్రాప్ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ బి.కుమారి, బి.దుర్గారాణి, ఎస్.చిన్నిబాబు, ఎం.సుధాకర్, దుర్గభవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటకృష్ణరాయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాల్య వివాహ ముక్త్ భారత్‌పై ఐసీడీఎస్, చైల్డ్ హెల్ప్‌లైన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలికల అక్రమ రవాణా, పోక్సో చట్టం తదితర అంశాలను చైల్డ్‌లైన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నళినీకుమారి వివరించారు. బాల్య వివాహాల నిరోధంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'శాంతియుత వాతావరణానికి సహకరించాలి'



గొల్లప్రోలులో మాట్లాడుతున్న తహసీల్దారు రామకుమార్, ఎస్ఐ రామకృష్ణ

గొల్లప్రోలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి వివాదాలు లేకుండా శాంతియుత వాతావరణానికి సహకరించాలని గొల్లప్రోలు తహసీల్దారు రామకుమార్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ సూచించారు. గొల్లప్రోలులోని కొత్తపేట ప్రాంతంలో అనుమతులు లేకుండా చర్చిలు నిర్వహిస్తున్నారని, లౌడ్‌స్పీకర్లతో ఇబ్బంది ఎదుర్కొంటున్నామని హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టడం, అదే సమయంలో క్రైస్తవులు తాము ఎన్నో సంవత్సరాలుగా ప్రార్థనలు నిర్వహించుకుంటున్నామని చెప్పడంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అక్కడ పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు. చర్చిలను తాత్కాలికంగా మూసివేయాలని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు ఆదేశించారు. మరోవైపు చర్చిలు నిర్వహించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, అనుమతులు లేని చర్చిలను పూర్తిగా మూసివేయాలని హిందూ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఇరువర్గాలతో తహసీల్దారు, ఎస్ఐలు వేర్వేరుగా చర్చలు జరిపారు. ప్రస్తుతం సీఆర్‌పీసీ 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని, ఇరువర్గాలు అక్కడ ఏ విధమైన కార్యకలాపాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు వ్యవహరించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా ముందుజాగ్రత్త చర్యగా పోలీసు పికెట్ కొనసాగిస్తున్నారు.



డాక్టర్ సమతను సన్మానిస్తున్న విజయప్రకాష్



మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్ర సారథి



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

వైభవంగా శ్రీప్రకాష్ సినర్జీ స్కూలు వార్షికోత్సవం

కాకినాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ 11వ వార్షికోత్సవం (బ్లిట్జ్) సీతా నరసింహ క్షేత్రంలో వైభవంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఐఐఎఫ్‌టీ కాకినాడ హెడ్ డాక్టర్ వి.రవీంద్రసారథి, ఇంటర్నల్ మెడిసిన్ ప్రెస్బిటేరియన్ హాస్పిటల్, డెల్లాస్ టెక్సస్ డాక్టర్ సమత వెల్లంకి హాజరయ్యారు. రవీంద్ర సారథి మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలతో పాటు భావోద్వేగ మేథస్సు, పటిష్టమైన కార్య సంస్కృతి పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ప్రపంచ దృక్పథంతో పాటు విద్యార్థులకు ఉన్నత విలువలు పెంచేందుకు శ్రీప్రకాష్ విద్యా సంస్థలు చేస్తున్న కృషిని డాక్టర్ సమత వెల్లంకి కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు కళలు, సంస్కృతి, ఆధునిక శాస్త్ర విజ్ఞానానికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగాలని పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ కోరారు. విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొని ఆహుతులను అలరించారు. దేహదారుఢ్యం కోసం విద్యార్థులు యోగా, జిమ్నాస్టిక్స్, తైక్వాండో, కలరిపయట్టు, కర్రసాము వంటి యుద్ధ కళల్లో ప్రావీణ్యం కనబర్చారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, గీత, నృత్య షాడోషా, యానిమేటెడ్ కథల్లో ప్రతిభతో ఆహుతులను అబ్బురపరిచారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, కాకినాడ సినర్జీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీదేవి, ప్లస్-1, ప్లస్-2 కో- ఆర్డినేటర్ కె.విశ్వనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు. పిల్లల సాంస్కృతిక, కళా ప్రదర్శనలను వీక్షించిన తల్లిదండ్రులు ఆనందపడ్డారు.

'ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదు'

తాళ్లరేవు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకారాదని ఎంఈవో మోకా ఉమ అన్నారు. బుధవారం గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. భవిత టీచరు ఆశీర్వాదం అధ్యక్షతన నిర్వహించిన ఆటల పోటీల్లో దివ్యాంగులు ప్రతిభ కనబరిచారు. వారికి సర్పంచ్ కామాడి గోవలక్ష్మి బహుమతులు అందించారు. దివ్యాంగులతో కేక్ కట్ చేయించారు. హెచ్ఎం లంకా గోవిందరాజులు, టీచర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

పిఠాపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం నరసింగపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మానవహక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పిఠాపురం లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి ప్యానల్ లాయర్‌గా ఉన్న కొంగు సూకరాజు మానవహక్కులకు భంగం కలిగితే ఎవరిని ఆశ్రయించాలి, మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి, బ్యాడ్, గుడ్ టచ్ గురించి వివరించారు. హెచ్ఎం ఎం.మాధవన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి'

పిఠాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పిఠాపురంలోని వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, నియోజకవర్గ కార్యదర్శి సాకా రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ నక్కా శ్రీనివాస్, ఎ.భవాని, వై.బాబీ, దొరబాబు, వెంకన్నదొర, నాగిరెడ్డి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పట్టు మార్కెట్ పరిస్థితిపై కలెక్టర్‌కు నివేదిక

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులోని ప్రభుత్వ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం (పట్టు మార్కెట్)లో తూకాల్లో వస్తున్న తేడాలపై పట్టు రైతులు ఆందోళన నిర్వహించిన నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై గొల్లప్రోలు తహసీల్దారు రామ్‌కుమార్ కలెక్టర్‌కు బుధవారం నివేదిక పంపారు. 100 కిలోలకు 2.50 కిలోలకు పైగా తూకంలో తేడా రావడంతో మూడేళ్లుగా తాము తీవ్రంగా నష్టపోయామని, ఇందుకు బాధ్యులైన పట్టు పరిశ్రమ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని, పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పట్టు మార్కెట్‌లోని ఎలక్ట్రానిక్ కాటాలో తూకంలో తేడాలు వస్తున్నట్టు గుర్తించిన తహసీల్దారు ఇందుకు సంబంధించిన వివరాలతో పాటు రైతులు పేర్కొన్న డిమాండ్లను వివరిస్తూ నివేదిక రూపొందించినట్టు సమాచారం. ఇందులో పట్టు పరిశ్రమల శాఖ అధికారుల నిర్లక్ష్యం తదితర అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది. మరోవైపు మంగళవారం ఎలక్ట్రానిక్ కాటాను తనిఖీ చేసి తేడాలను గుర్తించిన తూనికలు, కొలతల శాఖ అధికారులు బుధవారం పట్టు పరిశ్రమల శాఖ అధికారులకు నోటీసులు జారీ చేశారు.

రేపు కనకమహాలక్ష్మి అమ్మవారి గ్రామోత్సవం

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ద్వారకానగర్‌లో వేంచేసియున్న కనకమహాలక్ష్మి అమ్మవారి గ్రామోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్టు కార్యనిర్వాహణాధికారి పల్లాల కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేయవచ్చన్నారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 5 నుంచి 10 గంటల వరకు కనకమహాలక్ష్మి అమ్మవారికి సహస్ర కుంభాభిషేకం ఆగమశాస్త్ర పండితుల మంత్రోచ్చారణతో జరుగుతుందన్నారు. భక్తులు పంచామృతం, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసం, పన్నీరు, కొబ్బరి నీరు, మంచి నీరుతో అభిషేకం చేయవచ్చన్నారు. చక్రవర్తుల గోపాలకృష్ణమాచారి, పండితులు అమ్మవారికి లక్ష కుంకుమ పూజ జరుపుతారన్నారు. ఆ రోజు మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందని చెప్పారు.

మంగళగిరి చేనేతశాలలో మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటుచేసిన చేనేతశాలను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సందర్శించారు. మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో ఏర్పాటుచేసిన ఈ శాలలో 20 అత్యాధునిక మగ్గాలు ఏర్పాటుచేసి కార్మికులు ప్రతిరోజూ చీరలు నేసే ఏర్పాటు చేశారు. వీరు నేసిన చీరలు, ఇతర వస్త్రాలను టాటా కంపెనీకి అను బంధంగా ఉన్న తనేరా కంపెనీ కొనుగోలు చేస్తుందని వర్మ తెలిపారు. తద్వారా కార్మికులకు మార్కెటింగ్ ఇబ్బంది లేకపోగా వారు నేసిన వస్త్రాలకు మంచి ధర లభిస్తోందని చెప్పారు. చేనేత కార్మికులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.



నిన్న... నేడు

బస్తాలు తొలగించారు

సామర్లకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'పుస్తకాల గదిలో బస్తాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు సామర్లకోట ఎంఈవో వై.శివరామకృష్ణయ్య పాఠశాల ఉపాధ్యాయుల ద్వారా వాస్తవ సమాచారాన్ని సేకరించడమే గాక తరగతి గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను తొలగించారు. తరగతి గది తలుపుల తాళాలను ఉపాధ్యాయురాలికి అప్పగించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

సామర్లకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 26 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.22.60 లక్షలు మంజూరైంది. బుధవారం రాత్రి టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అందజేశారు. టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), బలుసు శ్రీనివాసు. జయలక్ష్మి, కొండపల్లి కృష్ణమూర్తి, తోటకూర శ్రీనివాసు, గుమ్మళ్ల రామకృష్ణ, పైబ్ణి శ్రీనివాసు, జార్జిచక్రవర్తి, గొలితి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల తనిఖీ

పిఠాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ట్రైనీ కలెక్టర్ మనీషా బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు, వినియోగించిన మెటీరియల్ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఆమె వెంట కమిషనరు రాజు, ఏఈ అభిలాష్ ఉన్నారు.

వృద్ధురాలికి ఇంటి వద్దే రేషన్ బియ్యం అందజేత



కాకినాడ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని 36వ డివిజన్ వెంపటి వారి వీధిలో నివసిస్తున్న బోయి నారాయణమ్మ అనే వృద్ధురాలు మూడు నెలలుగా రేషన్ బియ్యం అందక అలమటిస్తోంది. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ సంబంధిత 30వ నెంబరు రేషన్ డీలరుకు సమాచారం అందించారు. చౌక దుకాణం స్టాఫ్ ద్వారా 15 కిలోల బియ్యాన్ని బుధవారం నారాయణమ్మ ఇంటి వద్ద శ్రీనివాస్ అందజేశారు. టీడీపీ నాయకుడు సుగ్గు దుర్గా నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల పరిశీలన

గండేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెడ్.రాగంపేట, నీలాద్రిరావుపేట, యల్లమిల్లి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను ఐఆర్ఆర్‌టి జిల్లా కోఆర్డినేటర్ పి.గిరిప్రసాద్ బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి విద్య పట్ల వారి ఆసక్తిని పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట సీఆర్‌పీ తాతబాబు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పోలవరం పరిహారానికి మళ్లీ తనిఖీలు

● విసిగిపోతున్న నిర్వాసితులు


అర్హతలను తనఖీ చేస్తున్న ఆర్ అండ్ ఆర్ సిబ్బంది

చింతూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలవరం పరిహారం పొందే కుటుంబాల అర్హత తనిఖీలను బుధవారం చింతూరులో ఆర్అండ్ఆర్ సిబ్బంది చేపట్టారు. ఇప్పటివరకు చింతూరుకు చెందిన 1375 కుటుంబాల వరకు తమ వివరాలను ఆర్అండ్ఆర్ అధికారులకు పలుమార్లు అప్పగించారు. ఈతంతు దాదాపుగా మూడేళ్లపైబడే సాగుతోంది. అధికారులు అడిగిన ప్రుడల్లా తమకు చెందిన వివరాల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లను నిర్వాసితులు అందజేస్తూ వస్తున్నారు. ఇటీవల కొంతమంది నిర్వాసితుల ఖాతాలలో ఇంటి నిర్మాణ పరిహారపు సొమ్ములు కూడా జమయ్యాయి. దీంతో మిగిలిన నిర్వాసితులు తమకు కూడా పరిహారపు సొమ్ములు ఖాతాలలో జమవుతాయన్న భావనతో రోజూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. బుధవారం అర్అండ్ఆర్ అధికా రులు దాదాపు 550 కుటుంబాలకు చెందిన ధ్రువీకరణ పత్రాలు సరిగాలేవని తిరిగి సర్వే చేయాల్సి ఉందని పేర్కొనడంతో నిర్వాసితులు ఒక్కసారిగా విస్తుపోయారు. ఈ దఫా తాము చేపట్టిన సర్వేలో అర్హత ఉండి పరిహారం పొందేందుకు నమోదుకాని కుటుంబాల వివరాలను, అర్హత లేకపోయినా పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల వివరాలను క్షేత్రస్థాయి సర్వేతో తేల్చనున్నట్లు ఆర్అండ్ఆర్ అధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో పరిహారం పొందేందుకు అర్హతకలిగి ఉన్న కుటుంబాలను నమోదు చేయడంతోపాటు అర్హత లేకున్నా పరిహారంకోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాలను లిస్టు నుంచి తొలగించడం జరుగుతుందంటున్నారు. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చి ందని, ఇలా ఎన్ని పర్యాయాలు అర్హతను సూచించే జిరాక్స్ కాపీలు అధికారులకు ఇవ్వాలని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే బిడ్డను కోల్పోయాం

చింతూరు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): వైద్యులు సకాలంలో చికిత్స అందించకపోవడంతోనే తాము తమ బిడ్డను కోల్పోవాల్సి వచ్చిందని మనోజ్ ఆరోపించారు. బుధవారం చింతూరు ఐటీడీఏలో జరిగిన గ్రీవెన్సులో ఐటీడీఏ పీవో శుభం నోక్వాల్‌కు వైద్యుల నిర్లక్ష్య వైఖరిని పేర్కొంటూ మనోజ్ వినతిపత్రం అందజేశారు. వినతి పత్రంలో సారాంశ మిలా.. చింతూరు మండలం గూడూరుకు చెందిన మనోజ్, చిలకమ్మల బిడ్డ మాన్వితశ్రీ (రెండు నెలల వయసు) గత నెల 25న వ్యాధిభారిన పడింది. దీంతో మాన్వితశ్రీని అదేరోజు చింతూరు ఏరియా ఆసుపత్రికి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తీసుకొచ్చారు. వైద్యులు సాయంత్రం ఆరుగంటలవరకు మాన్వితశ్రీని అడ్మిట్ చేసుకోలేదని మనోజ్ ఆరోపించారు. ఆసుపత్రిలో అడ్మిట్ సమ యం వైద్యులు తమకు అనుకూలంగా మార్చుకున్నట్లు ఆ వినతిపత్రంలో మనోజ్ పేర్కొన్నారు. చివరకు తమబిడ్డ ప్రాణాలు కోల్పోయిందని పేర్కొన్నారు. ఇటువంటి దయనీయ పరిస్థితి మరే ఇతర కుటుంబానికి జరుగకూడదని ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని మనోజ్ కోరారు.

●ఈవిషయమై చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి మాట్లాడుతూ సకాలంలోనే చికిత్స మొదలుపెట్టామని, పరిస్థితి విషమించడంతో భద్రాచలం తరలించామన్నారు. బిడ్డ ఆరోగ్య పరిస్థితి విషమించి చివరకు ప్రాణాలు కోల్పోయిందన్నారు.

ఘనంగా మానవహక్కుల దినోత్సవం

అడ్డతీగల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రంపచోడవరం ఇన్‌చార్జి డాక్టర్ కోదండ వాసవి అధ్యక్షతన 76వ అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం నిర్వహించారు. మేజిస్ట్రేట్ కోర్టు వారు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. అడ్వకేట్ కెఎస్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ చట్టం పట్ల విద్యార్థులు మంచి అవగాహన కలిగి ఉండాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టే వారిపై ఎలాంటి శిక్షలు ఉంటాయనే వాటిపై సవివరంగా వివరించారు. డాక్టర్ ఏవీ మోహన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతటి చక్కటిదితో వారి విధులు సక్రమంగా నిర్వహించగలిగితే ఎలాంటి సమస్య రాకుండా ఎదుర్కోవచ్చన్నారు. జాలరి వీరభద్రరావు, బాదా మోహన్, కృష్ణారెడ్డి, గిరిబాబు, ముసలయ్య, లింగారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన బీజేపీ నాయకులు


ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో బీజేపీ నాయకులు

దేవీపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డిని దేవీపట్నం మండల బీజేపీ నాయకులు, నిర్వాసితులు బుధవారం కలిశారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలైన దేవీపట్నం మండలంలో 44 గ్రామాల ప్రజలకు జీవనోపాధి కింద కేంద్రం నుంచి జీడిపిక్కల ప్యాక్టరీగాని జీవనాధారం కింద ఏదైనా ప్యాక్టరీ నిర్మించాలని కోరారు. స్థానిక యువత ఉద్యోగాల కోసం ఎక్కడికో వెళ్లాల్సి వస్తోందన్నారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని సెంట్రల్ మినిస్టర్‌తో మాట్లాడతానని భరోసా ఇచ్చారు. బీజేపీ నాయకులు గోవిందరావు, సాయిరాంరెడ్డి, రామిరెడ్డి, రమేష్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భానుశంకర్‌రెడ్డి నిర్వాసితులు పాల్గొన్నారు.

కాచవరం, పోచవరం పంచాయతీలను ముంపు జాబితాలో కలపండి


ఐటీడీఏ ఏపీవోకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

కూనవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచవరం, కాచవరం పంచాయతీలను 41.1 కాంటూర్‌లో కలిపి పోలవరం ముంపు పంచాయతీలుగా గుర్తించి వెంటనే పోలవరం పరిహారం ఇవ్వాలని కోరుతూ బుధవారం చింతూరు ఐటీడీఏలో జరిగిన దర్బారులో ఏపీవో రామతులసికి వినతి పత్రం అందజేశారు. ప్రతీసారి వచ్చే గోదావరి వరద ఈ పంచాయతీల ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గడేసుల ప్రేమ్ చంద్, రసూల్, గేడల హరినాథ్, ప్రతాప్ తదితరులున్నారు.

రగ్గుల వితరణ



చింతూరు ఏరియా ఆసుపత్రికి రగ్గులు విరాళంగా ఇస్తున్న జేకే సీటీ చైర్మన్ జమాల్‌ఖాన్

చింతూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఏరియా ఆసుపత్రికి 50 రగ్గులను జేకే సీటీ చైర్మన్ జమాల్‌ఖాన్ బుధవారం ఉచితంగా అందజేశారు. రగ్గులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కోటిరెడ్డికి అందించారు. చలికాలం కావడంతో ఆసుపత్రిలో వ్యాధిగ్రస్థులు చలికి ఇబ్బంది పడకుండా తమవంతు సహకారం అందించినట్లు జమాల్‌ఖాన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రియాజ్, సాల్మన్‌రాజు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

41.15 కాంటూరులో చేర్చి పరిహారం ఇప్పించండి

ఎటపాక, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంను 41.15 కాంటూరులో చేర్చి ఆర్అండ్అర్ ప్యాకేజీతోపాటు భూములకు పెరిగిన ధరలకు అనుగుణంగా నష్ట పరిహారం చెల్లించాలని రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామా నాయుడిని గన్నవరం గ్రామానికి చెందిన రైతులు కరి చిన్నశ్రీనివాసరావు, కరి వెంకట్రావు, మాచినేని వెంకన్న కోరా రు. ఈమేరకు బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రిని కలిశారు. వరదల సమయంలో గ్రామం చుట్టూ వరదనీరు చుట్టేస్తుందని, ఆసమయంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని, బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుందన్నారు. గోదావరి వరదలతో గ్రామాల్లో పంట సాగు చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. భూ ములకు గతంలో నష్టపరిహారం ఇవ్వలేదని, గ్రామ సభలు నిర్వహించి భూములకు పరిహారం చెల్లించాలని కోరారు. పునరావాసంతోపాటు ఆర్అర్ ప్యాకేజీ ఇప్పించి తమకు న్యాయం చేయాలని కోరారు. మంత్రి రామానాయుడు స్పందించిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

'ఎఫ్ఎల్ఎన్'ను విజయవంతం చేయాలి

● ఉపాధ్యాయులు ఆత్మ విమర్శ చేసుకోవాలి

● జిల్లా విద్యాశాఖాధికారి రమేష్


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

తొండంగి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్‌ల్ లిటరసీ అండ్ న్యుమరసీ) కార్యక్రమాన్ని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్తిగా విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాదికారి పి.రమేష్ అన్నారు. బుధవారం తొండంగిలో మండలంలోని సెకెండరీగ్రేడ్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం, ప్రాథమిక గణితంలో కనీస సామర్థ్యాలు సాధించే నిమిత్తం 75 రోజుల ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం ఈనెల 8 నుంచి ప్రారంభమయ్యిందన్నారు. దీనిని అన్ని పాఠశాలల్లో చిత్తశుద్ధితో అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు ఉన్నా ఇంకా పిల్లలు కనీస సామర్థ్యాలు సాధించలేకపోవడం పట్ల ఉపాధ్యాయులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులను దేవుడిచ్చిన పిల్లలుగా భావించి తమ పిల్లలతో సమానంగా విద్యాబుద్ధులు చెప్పి తీర్చిదిద్దాలన్నారు. అత్యంత పేదరికంలో ఉన్న పిల్లలను పట్టించుకోకపోతే వారి జీవితాన్ని నాశనం చేసినట్లవుతుందన్నారు. 75 రోజుల ప్రోగ్రాం అనంతరం అన్ని పాఠశాలల్లో పిల్లలు కనీస సామర్థ్యాలు సాధించాలన్నారు. కమిషనర్ సూచనల మేరకు విద్యార్థులు వాటిని సాధించినట్టు ఉపాధ్యాయులు సర్టిఫై చేయాలన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులంతా సంసిద్ధులు కావాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి,ఉపాధ్యాయులు ఉన్నారు.

మెరుగైన ఉత్పత్తులే లక్ష్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్

తుని రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ఉత్పత్తులు అమలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జాతీయ, గ్రామీణ మిషన్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ డీపీఎం బాబురావు స్పష్టం చేశారు. తునిలో రైతు ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధుల శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో మెరుగైన ఎగుమతులు, ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. వ్యవసాయ క్షేత్రాల్లో నాటు కోళ్ల ఫామ్‌ను, కోకోతోటలను పరిశీలించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు తమరాన వరలక్ష్మి, ఏపీఎం అనీల్‌కుమార్, మండల సమాఖ్య ఓబీ, జిల్లా, మండల స్థాయి సిబ్బంది ఉన్నారు.

'ఆదిత్య'లో వాలీబాల్ చాంపియన్‌షిప్

గండేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకే, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, రాజీవ్ గాంధీ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో జరిగాయి. మొదటిరోజు పోటీలు వివిధ టీమ్‌ల మధ్య సాగాయని యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫూల్‌డి పోటీలు ఆదిత్యలో జరుగుతున్నాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయ విభాగాధిపతి డాక్టర్ ఎన్.రవి తదితరులున్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిరుపేదలకు వరం లాంటిదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తెలిపారు. రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. నియోజవర్గంలోని 26 మందికి రూ. 17.78 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, తోట గాంధీ, నీలం శ్రీను, పాండ్రంగి రాంబాబు, రేఖ బుల్లి రాజు, పాఠంశెట్టి రవి, కుంచే తాతాజీ, జ్యోతుల రాంబాబు, ఎస్ బాబు, రాయి సాయి, నలమహారాజు, బు సాల విష్ణు, బాలనాగు, కురుకూరి చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

'ముంపు గ్రామాల మీదుగా శాశ్వత డ్రైన్ నిర్మాణం'



సమావేశంలో మాట్లాడుతున్న యనమల రాజేష్

తొండంగి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యనమల దివ్య సూచనల మేరకు కోన ప్రాంతంలో ముంపు నివారణకు శాశ్వత ప్రాతిపదికన కార్యాచరణ రూపొందించారు. దీ నిపై అవగాహన కల్పించే నిమిత్తం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ ఆధ్వర్యంలో గ్రా మస్తులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చే శారు. రూ.50 లక్షల నిధులతో ముంపు గ్రా మాల మీదుగా శాశ్వత ప్రాతిపదికన డ్రైన్ నిర్మాణం చేపట్టేందుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారని రాజేష్ వివరించారు. దీని వల్ల ఏ గ్రామానికి ఎటువంటి ఇబ్బంది కలుగని రీతిలో పనులు ఉంటాయన్నారు. గ్రామస్తులకు ఇబ్బం ది కలగని విధంగా చూడాలని ఎమ్మెల్యే సూచి ంచారన్నారు. అనేక ప్రత్యామ్నాయాలు అన్వే షించి ప్రజలకు ఇబ్బందికలగని రీతిలో మేజర్ డ్రైన్ నిర్మాణం చేపడతారన్నారు. దీనిపై ఇప్పటి కే సర్వే పనులు పూర్తయ్యాయన్నారు. ప్రజలు సహకరించి పని పూర్తయ్యేందుకు తోడ్పాటునందించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో సాయి నవీన్, డిప్యూటీ తహశీల్దార్ వీరేష్ ఉన్నారు.

మట్టి నమూనాపై విద్యార్థులకు అవగాహన


లింగంపర్తిలో మట్టి సేకరిస్తున్న వ్యవసాయాధికారులు, విద్యార్థులు

ఏలేశ్వరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ నేతృత్వంలో పాఠశాల విద్యార్థులకు మట్టి నమూనా సేకరణ పై అవగాహన కల్పించారు. బుధవారం వ్యవసా యాధికారిణి పీకేవీ లక్ష్మీ పట్టణ పరిధిలో గురుకుల పాఠశాల, లింగంపర్తిలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మట్టి సేకరణ, పరీక్ష విధానంపై స్క్రీన్ ద్వారా అవగాహన కల్పిం చారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పంట దిగుబడి పెరగాలంటే భూసార పరీక్ష చేయించి సమతుల్య పోషకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏవో రాజేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ప్రసన్న వేంకటేశ్వరుడి దీక్షలు


పాతకొట్టాంలో వెలసిన స్వామివారు

కోటనందూరు,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలం పాత కొట్టాం గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 16వ తేదీ నుంచి మూడు విడతలుగా దీక్షలు ప్రారంభమవుతాయని దేవస్థానం కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. అందులో భాగంగా మొదట విడతగా ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు 30 రోజులపాటు, రెండో విడతగా 25 నుంచి జనవరి 14 వరకు 21 రోజులపాటు మూడోవిడత దీక్ష , జనవరి 4 నుంచి 14 వరకు 11 రోజులపాటు దీక్షలు ప్రారంభమవుతున్నాయన్నారు. భక్తులందరూ మాలధారణ వేసుకొని వేంకటేశ్వరస్వామి అనుగ్రహం పొందాలని కమిటీ పేర్కొంది.

ఉద్యమ ఆధార్‌పై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న రాజేష్

రౌతులపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో చిన్న, మధ్య తరగతి పరిశ్రమలపై ఉద్యమ ఆధార్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం చిన్న, మధ్య పరిశ్రమలకు కల్పిస్తున్న రాయితీలను ఎంఎస్ఎంఈ ఐపీవో రాజేష్ వివరించారు. మహిళలు ఉద్యమ ఆధార్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు కేతిరెడ్డి త్రినాథమ్మ, విజయలక్ష్మి, సీసీలు అప్పలకొండ, నాగమణి, రత్నరాజు, సీత, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

●ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు


ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు పేర్కొన్నారు. బుధవారం మర్రివీడు, చిన్నింపేట గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.3.6 కోట్ల నిధులు విడుదలయ్యాయన్నారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కృషితో నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

రాచపల్లి రహదారికి రూ.2.50 కోట్లు

ప్రత్తిపాడు: రాచపల్లి రహదారి అభివృద్ధికి రూ.2.50 కోట్లు నిధులు మంజూరయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు అమరాది వెంకట్రావు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కృషితో రాచపల్లి అడ్డరోడ్డు సెంటర్ నుంచి ఒమ్మంగి గ్రామం వరకు 3.5 కిలోమీటర్ల రహదారికి పంచాయతీ రాజ్ శాఖ నిధులు మంజూరు చేసిందన్నారు.

పెద్దమల్లాపురంలో శ్రీప్రజ్ఞానందా బాల సరస్వతి పూజలు


అయ్యప్పకు పూజలు చేస్తున్న ప్రజ్ఞానందా బాల సరస్వతి

శంఖవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమల్లాపురంలో గల ఆంధ్రా శబరిమలై క్షేత్రాన్ని బుధవారం పెనుగొండ శ్రీవాసవీ కన్యకాపర మేశ్వరిదేవి పుణ్యక్షేత్రం నుంచి పీఠాధిపతి శ్రీప్రజ్ఞానందా బాల సరస్వతి సందర్శించారు. గర్భగుడిలో అయ్యప్ప స్వామి వారి మూలవిరాట్‌ను దర్శించి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ క్షేత్రం భవిష్యత్‌లో మహాపుణ్యక్షేత్రం అవుతుందన్నారు. ఈ ఆలయాన్ని ఇక్కడ నిర్మించడం ఆలయ ధర్మకర్త కుసు మంచి శ్రీనివాసరావు పూర్వజన్మ పుణ్యమన్నారు. తొలుత పీఠాధిపతి ప్రజ్ఞానందా స్వామికి ఆలయ ధర్మకర్త కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయానికి వందలాది మంది తరలివచ్చారు. గౌరంపేట గ్రామానికి చెందిన ఆర్ఎస్ఎస్ సేవకుడు పడాల రాంబాబు ఆలయానికి విచ్చేసి స్వామివార్ని దర్శించుకున్నారు.

ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం


కోటనందూరులో పొలంపిలుస్తోంది కార్యక్రమం

కోటనందూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలుకు చర్యలు చేపడుతున్నామని వ్యవశాయశాఖ ఏడీ కేజీ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కాకరాపల్లి, కోటనందూరులో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పండించిన ధాన్యంను నేరుగా రైతు భరోసాకేంద్రంను అమ్మాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ధాన్యం కొన్న వెంటనే 24 గంట్లో డబ్బులు వేస్తున్న దృష్ట్యా అందరూ ప్రభుత్వానికి అమ్మాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో జగ్గఅప్పారావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీటిని అందజేస్తాం

● సర్పంచ్ పైల సీత, ఎంపీటీసీ సోమరౌతు రవి

రౌతులపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికీ తాగునీటిని అందజేస్తామని సర్పంచ్ పైల సీత, ఎంపీటీసీ సోమరౌతు రవి అన్నారు. బలరామపురంలో జేజేఎం నిధులు రూ. 37.70 లక్షలతో ఇంటింటికి కుళాయి పథకాన్ని బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సహకారంతో పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రతి ఇంటికి నీటిని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కోరుప్రోలు సత్తిబాబు, యాగదాసు నాగేశ్వరరావు, పల్లా చంటి, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 11కేవీ గోకవరం రోడ్ ఫీడర్, జగ్గంపేట ఇండస్ట్రియల్ ఫీడర్, నరేంద్రపట్నం ఫీడర్ నందు మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ వీరభద్రరావు తెలిపారు. గోకవరం రోడ్, బాలాజీనగర్, శ్రీరామ్ నగర్, పోలీస్ స్టేషన్, ఎంఆర్‌వో ఆఫీస్, నీలాజలంపేట, నెహ్రూ కాలనీ, టీచర్స్ కాలనీ, టవర్ కాలనీ, గొల్లలగుంట, గుర్రంపాలెం గ్రామాలకు, బోరులకు.. మర్రిపాక బోర్లు, చేపల చెరువులు, వాటర్‌వర్క్స్, రామవరం గ్రామం, ఆక్వా సర్వీసులు, కాండ్రేగుల బోర్లు, నరేంద్రపట్నం బోర్లకు సరఫరా ఉండదని తెలిపారు.

మద్యం తాగి వాహనాల నడిపినవారికి జరిమానా, జైలు శిక్ష

జగ్గంపేట/గండేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సర్కిల్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. జగ్గంపేట ఎస్ఐ రఘునందన్‌రావు నలుగురిని, గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు 13 మందిని పట్టుకోగా కోర్టులో హాజరుపరచినట్లు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. 11 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా, ఆరుగురికి 3 రోజులపాటు జైలు శిక్ష విధించగా వారిని పెద్దాపురం సబ్ జైలు కు తరలించామన్నారు.

బస్సు ఏర్పాటు చేయాలని విద్యార్థుల ఆందోళన


రాజుపాలెం రహదారిపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కిర్లంపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి పెద్దిపాలెం వరకు విద్యార్థులకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కిర్లంపూడి మండలం రాజుపాలెం రహదారిపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఉదయం 7.30కు పెద్దిపాలెం బస్సు ప్రారంభమై కాకినాడ డిపోకు చేరుకుని తిరిగి సాయంత్రం 5గంటలకు పీఆర్ కాలేజీ వద్ద నుంచి బస్సు పెద్దిపాలెంకు నడపాలన్నారు. దీంతో ప్రత్తిపాడు ఎంక్వైరీ ఆఫీసర్ వచ్చి సమస్య పరిష్కరిస్తామన్నారు. బస్సు ఏర్పాటు చేయకపోతే మళ్లీ ధర్నాకు దిగుతామని ఎస్ఎఫ్ఐ నాయకుడు చవాకుల నరసింహమూర్తి చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలేశ్వరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిన్నింపేట, సిరిపురం గ్రామాలకు విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు బుధవారం ఈఈ వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ప్రత్తిపాడులో న్యాయ విజ్ఞాన సదస్సు


సదస్సులో ప్రసంగిస్తున్న జడ్జి గోపినాథ్

ప్రత్తిపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో మండల సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి ఎల్.గోపీనాథ్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మనిషి జననం నుంచి మరణం వరకు అనేక హక్కులు ఉన్నాయని, ఆ హక్కుల రక్షణకు న్యాయస్థానాలు కృషి చేస్తాయన్నారు. శనివారం స్థానిక కోర్టులో జరిగే జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ప్యానల్ అడ్వకేట్లు బుగతా శివ, బి.మధుబాబు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ


త్రిమూర్తులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

రౌతులపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. ఎస్.పైడిపాలలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టీడీపీ కార్యకర్త కూరగాయల త్రిమూర్తులను ఆమె పరామర్శించారు. మాజీ సర్పంచ్‌లు గోల్ల పెద్దదివాణం, ఈగల సత్తి బాబు, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారా యణ, ఇటం శెట్టి అశోక్, పసగడుగుల రమణ పాల్గొన్నారు.